TELANGANA RISING
CURE - PURE - RARE

www.hamsakalam.com
PRGI: TGTEL/26/A3129
సంచలన తెలుగు దినపత్రిక

# హంస కలం వార్త

HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి



EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:5 WEDNESDAY ,MAY 13,2026 PAGES:8 COST: 4 /-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 5 బుధవారం 13 మే 2026 పేజీలు :8 వెల: 4/-

## ధాన్యం సేకరణలో నిర్లక్ష్యం సహించం

### కలెక్టర్లకు సిఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు

హంసకలం వార్త మే 12

ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.ధాన్యం లోడ్ తరలించేందుకు ఒప్పందం మేరకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లను ఉపేక్షించొద్దని అవసరమైతే అలాంటి వారిపై క్రిమినల్ కేసులకు వెనకాడవద్దని ముఖ్యమంత్రి ఆదేశించారు. మొక్క జొన్న పంట ఎక్కువగా వచ్చే జిల్లాల కలెక్టర్లు కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడా రైతులకు ఇబ్బందులు కలగొద్దని తెలిపారు. అవసరమైన చోట పోలీస్ సహాయం తీసుకుని కలెక్టర్లు ధాన్యం సేకరణ సాఫీగా జరిగేలా చూడాలని సూచించారు. మంగళవారం.. జిల్లా కలెక్టర్లతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో మొక్క జొన్న కొనుగోలు, వరి ధాన్యం సేకరణ - మిగతా2లో



## పెండింగ్ డబుల్ బెడ్రూం ఇళ్లను లబ్ధిదారులకు ఇచ్చేందుకు స్పెషల్ డ్రైవ్



2

- హైదరాబాద్‌లో ఇళ్ళ స్థలాలు ఉంటే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్న మంత్రి
- జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత పంపిణీ ప్రారంభిస్తామని వెల్లడి
- విధివిధానాలను ఈ నెల 21న ఖరారు చేస్తామన్న మంత్రి

## నీట్ ప్రవేశ పరీక్ష రద్దు

హంసకలం వార్త మే 12

జాతీయ అర్హత పరీక్ష నీట్ యూజీ-2026ను రద్దు చేసారు. పేపర్ లీక్ ఆరోపణలు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. నీట్ పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రం రాజస్థాన్‌లో లీకైనట్లు వచ్చిన వార్తలు పెనుదుమారం రేపాయి. ఈ నేపథ్యంలో జాతీయ పరీక్ష సంస్థ(ఎన్‌టీఏ) కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా మే 3న జరిగిన నీట్ పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. త్వరలోనే కొత్త పరీక్ష తేదీలను వెల్లడిస్తామని తెలిపింది. - మిగతా2లో




## బీఆర్ఎస్ కీలక నేతలతో కేసీఆర్ భేటీ

హంసకలం వార్త మే 12

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన ఎర్రవెల్లి ఫాంహౌస్‌లో కీలక సమావేశం జరిగింది. పార్టీ సంస్థాగత మార్పులు, భవిష్యత్తు కార్యాచరణపై ఈ భేటీలో స్పష్టమైన దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో, పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయడంపై కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయడం... జిల్లా, నియోజకవర్గాల వారీగా పార్టీ ఇన్‌ఛార్జుల నియామకం, అలాగే - మిగతా2లో



## బండి కుమారుడిని తప్పించే యత్నం

హంసకలం వార్త మే 12

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు, దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేంద్రమంత్రి కుమారుడు పరారీలో ఉన్నాడని అనడం హాస్యాస్పదమని అన్నారు. సిట్ విచారణ పేరిట నిందితుడిని సీఎం రేవంత్ రెడ్డి - మిగతా2లో



## నీట్ పేపర్ లీకేజీకి కేంద్రానిదే బాధ్యత



హంసకలం వార్త మే 12

దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష రద్దు కావడంపై ఎంపీ చామల కిరణ్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. మే 3వ తేదీన జరిగిన నీట్ పరీక్షను రద్దు చేశారని అన్నారు. నీట్ పరీక్ష రద్దుకు నేషనల్ టెస్ట్ ఏజెన్సీ, సెంట్రల్ ఎడ్యుకేషన్ మినిస్టీ, కేంద్రంలో అధికారంలో - మిగతా2లో

## ఆనాటి జైళ్లు దుర్భరంగా ఉండేవి

### చంచల్‌గూడాలో మ్యూజియం, ఫీల్ ది జైల్ ప్రారంభంలో గవర్నర్

హంసకలం వార్త మే 12

స్వాతంత్ర్యానికి ముందు జైళ్లు ఎంత అమానవీయంగా ఉండేవో ప్రజలకు తెలియజేయాల్సి ఉందని తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా తెలిపారు. మంగళవారం చంచల్ గూడ జైలులో ఏర్పాటు చేసిన మ్యూజియం, ఫీల్ ది జైల్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ స్వాతంత్రానికి పూర్వం జైల్లో గడిపిన వారు ఎలా ఉండేవారనే విషయం ఈ మ్యూజియంను చూస్తే తెలుస్తుందన్నారు. తెలంగాణ - మిగతా2లో



## తమిళ సిఎం విజయ్ సంచలన నిర్ణయం

హంసకలం వార్త మే 12

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థలు, దేవాలయాలు, బస్ స్టాండ్స్‌కి 500 మీటర్ల దూరంలో ఉన్న 717 వైన్ షాపులన్నింటినీ క్లోజ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. తమిళనాడు రాష్ట్ర మార్కెటింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ దుకాణాలను రెండు వారాల్లోగా మూసివేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత విజయ్ జారీ చేసిన తొలి - మిగతా2లో



## విదేశీ మారక నిల్వలు పెంచడం ఎలా

### ఎగుమతులను విస్మరించడంతోనే సమస్య

హంసకలం వార్త మే 12

మనవిదేశా మారక నిల్వలు పెరగాలంటే ఎగుమతులు పెరగాలి. దిగుమతలు తగ్గాలి. ఈ సూత్రాన్ని పాటించాల్సిన పాలకులు దీనిని పట్టించుకోవడం లేదు. పంటల దిగుబడి పెరుగుతున్నా వాటిని ఆదయ వనరుగా మార్చుకోవడంలో కేంద్రం విఫలం అవుతోంది. విదేశీమారక నిల్వలు తగ్గిపోతుంటే విదేశీ పెట్టుబడిదారులు ఆ దేశంలో తాము పెట్టిన పెట్టుబడులను వెనక్కి - మిగతా2లో



# ధాన్యం సేకరణలో నిర్లక్ష్యం సహించం

-మొదటిపేజీ తరువాయి

పై జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి సమీక్ష చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సీఎం ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోళ్ల తీరును పరిశీలించాలని.. గన్ని బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటి కప్పుడు గోడౌన్స్‌కు తరలించాలని అన్నారు. ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలను అందుబాటులో ఉండేలా చూడాలని రవాణా శాఖ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. సమస్య తీవ్రతను గుర్తించి జిల్లా కలెక్టర్లు సరైన చర్యలు తీసుకోవాల్సిందే అని.. ప్రతి అధికారి జవాబుదారీ తనంతో వ్యవహరించాల్సిందే అని తేల్చిచెప్పారు. నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్లపై చర్యలకు ప్రభుత్వం వెనకాడదని హెచ్చరించారు. గోడౌన్స్ సమస్య ఉన్న ప్రాంతాల్లో అవసరాన్నిబట్టి తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. రైతుబజార్లు, ఫంక్షన్ హాల్స్‌ను ఎంగేజ్ చేసి ధాన్యాన్ని తరలించాల న్నారు. వెసులుబాటు ఆధారంగా అక్కడినుంచి గోడౌన్స్‌కు తరలించేలా ప్రణాళికలుండాలని తెలిపారు. కొనుగోళ్లపై ఎప్పటికప్పుడు సీఎస్‌కు పోర్ట్ పంపించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ధాన్యం లోడింగ్‌లో జాప్యం జరగకుండా స్థానికంగా ఉన్న హమామిలను గుర్తించి వారితో పని చేయించుకోవాలని రేవంత్ తెలిపారు. ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో లారీల కొరత ఉంటే ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించాలని సూచించారు. అకాల వర్షాల సమయంలో ధాన్యం తడవకుండా అవసరమైన టార్పాలిన్లను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. అకాల వర్షాల సమయంలో నష్టం జరగకుండా శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. వాతావరణ శాఖ సూచనల ఆధారంగా ఎప్పటికప్పుడు రైతులను అప్రమత్తం చేసేందుకు మండల స్థాయిలో ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని సీఎం ఆదేశించారు. వాతావరణ సూచనలను రైతులకు చేరవేసేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి ఐకేపీ సెంటర్‌కు ఒక అధికారిని నియమించాలని ఆదేశాలు జారీ చేశారు.ప్రతి రైస్ మిల్లు దగ్గర ఒక బాధ్యతాయుతమైన అధికారిని నియమించి పర్యవేక్షించాలన్నారు. మిషన్ మోడ్‌లో పనిచేస్తేనే సమస్యలు వేగంగా పరిష్కారమవుతాయని తెలిపారు.

# విదేశీ మారక నిల్వలు పెంచడం ఎలా

-మొదటిపేజీ తరువాయి

సాధారణంగా 7–10 నెలలపాటు ముడిచమురు దిగుమతులకు సరిపడా విదేశీ మారక ద్రవ్య నిల్వలు ఉంటే ఆ దేశ పరపతి బాగున్నట్టుగా అంచనా వేస్తారు. 1991లో మన దేశం వద్ద కేవలం 2 వారాలకు సరిపడా మాత్రమే విదేశీ మారక ద్రవ్య నిల్వలున్నాయి. అందుకే మన బంగారాన్ని లండన్‌కి పంపి తాకట్టు పెట్టాల్సిన పరిస్థితి వచ్చింది. ఆనాటి చంద్రశేఖర్ ప్రభుత్వం బంగారం తాకట్టు పెట్టింది. పివి నరసింహారావు ప్రధాని అయ్యాక ఆర్థిక సంస్కరణలు చేపట్టడంతో దేశం దారికి వచ్చింది. తాకట్టు పెట్టిన బంగారాన్ని వడిపంచుకోగలిగాం. దీంతో మళ్లీ మనదేశ ఆర్థిక వ్యవస్థ గాడిన పడిందంటే ఆ మహానుభావుడి చొరవే కారణం. ఇప్పుడు మోడీ కూడా అలాంటి చొరవ లేదా సంస్కరణలకు దిగాలి. మూడీస్, ఎస్ అండ్ పి, ఫిచ్ వంటి అంతర్జాతీయ సంస్థలు.. ఫారెక్స్ రిజర్వ్‌ ఎక్కువగా ఉన్న దేశాలకు మంచి రేటింగ్ ఇస్తాయి. ఆ రేటింగ్ ఎంత ఎక్కువ ఉంటే అంత తక్కువ వడ్డీకి అప్పులు లభిస్తాయి. ఒక దేశం విదేశాల నుంచి అప్పు తీసుకోవాలనుకుంటే.. ఆయా దేశాలు సదరు దేశం వద్ద విదేశీ మారక ద్రవ్య నిల్వలు ఎంత ఉన్నాయనే విషయాన్నే చూస్తాయి. ఇప్పుడు మన వద్ద విదేశీ మారక ద్రవ్య నిల్వలు దాదాపు 9 నుంచి 11 నెలలకు సరిపడా ఉన్నప్పటికీ.. పరిస్థితులు మన చేతుల్లో లేవు. పశ్చిమాసియాలో యుద్ధం ఇప్పట్లో ముగిసేలాగా కనిపించట్లేదు. ముడిచమురు ధరల భారంతోపాటు.. ఎరువుల ధరలు కూడా భారీగా పెరిగిపోయే ప్రమాదం కనపడుతోంది. అంటే వాటి దిగుమతుల కోసం చేయాల్సిన ఖర్చు మరింతగా పెరిగిపోయి డాలర్ల రిజర్వు అనుకున్నదానికంటే వేగంగా కరిగిపోయే ముప్పుంది. దీనికితోడు.. మనకు వచ్చే విదేశీ మారక ద్రవ్య నిల్వల్లో ఎక్కువ భాగం గల్ఫ్ దేశాల నుంచి వచ్చేవే. అక్కడున్న భారతీయులు మనదేశంలో ఉన్న తమ కుటుంబసభ్యులకు పంపే డబ్బు కారణంగా విదేశీ మారకం భారీగా పెరిగింది.. యుద్ధం దెబ్బకు అతలాకుతలమైన గల్ఫ్ దేశాల్లో ఉంటున్న మనవాళ్లు పంపే డబ్బు తగ్గిపోతోంది. దీనికితోడు.. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో మన ఎగుమతులకు, తద్వారా మనకు రావాల్సిన డాలర్లకు కూడా ఆటంకం కలుగుతోంది. ఒకవైపు మనకు రావాల్సిన విదేశీ మారక ద్రవ్యంలో కోత పడుతుండగా, మరోవైపు మన వద్ద ఉన్న నిల్వలు కరిగిపోతున్నాయి. 2025–26 బడ్జెట్ అంచనాల ప్రకారం, దేశ జాతీయ రుణం అక్షరాలా రూ. 235.4 లక్షల కోట్లు. 2014లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చే నాటికి మన అప్పు కేవలం రూ. 54.9 లక్షల కోట్లు మాత్రమే. అంటే, కేవలం పదేండ్ల కాలంలో దేశం చేసిన అప్పు 4.3 రెట్లు పెరిగింది. ప్రతి భారతీయుడిపై సగటున రూ. 1.66 లక్షల అప్పు ఉన్నది. జీడీపీలో అప్పు నిష్పత్తి 67 శాతం నుంచి 83.9శాతానికి చేరుకున్నది. భారత్ ఇప్పుడు ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అని పాలకులు గర్వంగా చెప్తుంటారు. 3.73 ట్రిలియన్ల డాలర్ల జీడీపీతో మనం ఆ స్థానంలో ఉన్నమాట నిజమే. కానీ, ఇందులో ఒక పెద్ద మాయ ఉన్నది. ఒక దేశం ఎంత ధనవంతమైనదో చెప్పాల్సింది దాని మొత్తం ఆదాయం కాదు, ఆ దేశ పౌరుడి తలసరి ఆదాయం. దేశ ఆర్థిక శక్తిని తలసరి ఆదాయపరంగా విశ్లేషిస్తే విస్తుపోయే వాస్తవాలు కనిపిస్తాయి. ఆదాయ పంపిణీలో ఇతర అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే మనం ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నామని, సంపద కేవలం పైస్థాయిలోనే కేంద్రీకృతమై సామాన్యుడి వరకు ఆశించిన స్థాయిలో చేరటం లేదని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

# ఆనాటి జైళ్లు దుర్భరంగా ఉండేవి

-మొదటిపేజీ తరువాయి

జైళ్ల శాఖ ఆధ్వర్యంలో మ్యూజియం, ఫీల్ ది జైల్ ప్రారంభించడం తనకు చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ మ్యూజియంలో ఉన్నది కేవలం ఇతిహాసానికి సంబంధించిన వస్తువులు కాదన్నారు. స్వాతంత్రానికి ముందు జైళ్లలో ఉన్నవారు ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నారో ఈ మ్యూజియం ద్వారా తెలుస్తుందని చెప్పారు. శిక్షల పేరుతో సంస్కారాన్ని, శరీరాన్ని, మనస్తత్వాన్ని విరగ్గొట్టే ప్రయత్నం చేశారని బ్రిటిష్ పాలనలో సాగిన అకృత్యాలను ఆయన వివరించారు. మన కోసం మన పూర్వీకులు పడ్డ కష్టాన్ని తెలుసుకునేందుకు ప్రతి ఒక్కరు ప్రయత్నం చేయాలని ప్రజలకు తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచించారు. విద్యార్థి నాయకుడిగా ఉన్న సమయంలో తాను పలుమార్లు జైలుకు వెళ్లానన్నారు. ఎమర్జె÷న్సీ సమయంలో 21 రోజులు తాను జైల్లో ఉన్నానని ఆయన గుర్తు చేసుకున్నారు. అప్పుడే జైలు ఎలా ఉంటుందో తనకు తెలిసిందని వివరించారు. గతంలో ఉత్తరప్రదేశ్‌లో కళ్యాణ్ సింగ్ ప్రభుత్వంలో జైళ్ల శాఖ మంత్రిగా తాను పని చేశానని తెలంగాణ గవర్నర్ గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా జైళ్లలో తాను పలు సంస్కరణలు తీసుకొచ్చానని తెలిపారు. ఈ సంస్కరణలతో ఖైదీలు సంతోషం వ్యక్తం చేశారని చెప్పారు. ఈ రోజు మ్యూజియంలో చూసిన దృశ్యాలతో.. మళ్లీ ఆనాటి జ్ఞాపకాలు తనకు గుర్తుకు వచ్చాయన్నారు. ఖైదీలలో ప్రతి ఒక్కరూ క్రిమినల్స్ కాదని.. పరిస్థితులు వారిని ఆ సమయంలో నిందితులుగా మార్చాయని వివరించారు. ఖైదీలలో మార్పు తీసుకురావడానికి అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని జైలు అధికారులకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచించారు. మరోసారి తప్పుచేసే ఆలోచన రాకుండా ఖైదీల్లో పరివర్తన తీసుకురావాలని అధికారులకు స్పష్టం చేశారు. సాధారణ ప్రజల కోసం చంచల్‌గూడ జైలు అధికారులు వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. జైలు ఆవరణలో 'జైల్ మ్యూజియం', 'ఫీల్ ది జైల్' పేరుతో ప్రత్యేక బ్లాక్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ప్రారంభించారు. ఇప్పటికే గోవా, కోల్‌కతా వంటి ప్రాంతాల్లో జైలు మ్యూజియాలు ఉన్నాయి. తాజాగా హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలు కూడా ఈ జాబితాలో చేరింది. జైల్ మ్యూజియంలో జైలు చరిత్ర, ఉపయోగించిన పాత వస్తువులు, ఖైదీల జీవితం, శిక్షల విధానాలు వంటి అంశాలను ప్రదర్శించనున్నారు. ఇది విద్యార్థులు, పర్యాటకులు, సాధారణ ప్రజలకు జైలు వ్యవస్థ గురించి అవగాహన కల్పించడానికి ఉపయోగపడనుంది. 'ఫీల్ ది జైల్' బ్యారక్ ద్వారా సాధారణ ప్రజలు ఒకరోజు జైలు జీవితాన్ని అనుభవించేలా జైలు అధికారులు అవకాశం కల్పించారు.

## బండి కుమారుడిని తప్పించే యత్నం

-మొదటిపేజీ తరువాయి

ఒక మైనర్ బాలికకు డ్రగ్స్ ఇచ్చి, మద్యం తాగించి అత్యాచారం చేసినట్లు ఆరోపణలు వస్తున్నా.. పోలీసులు మూడు నెలలుగా ఫిర్యాదు తీసుకోకుండా తాత్సారం చేయడం వెనుక రాజకీయ ఒత్తిడి ఉందని వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. మీడియాలో వార్తలు వచ్చిన వెంటనే గత్యంతరం లేక పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు. పోక్సో కేసులో బాధితురాలికి రక్షణ కల్పించాల్సింది పోయి.. ఆమెపైనే హనీట్రాప్ కేసు పెట్టడం దారుణమని మండిపడ్డారు. మైనర్ బాలిక హనీట్రాప్ చేస్తుందా అని ప్రశ్నించారు. బాధితురాలిపైనే రివర్స్ కేసులు పెట్టడం చూస్తుంటే రేవంత్ రెడ్డి, బండి సంజయ్ ఒక్కటేనని అర్థమవుతుందని అన్నారు. బాధితురాలిపైనే రివర్స్ కేసులు పెట్టడం చూస్తుంటే రేవంత్ రెడ్డి, బండి సంజయ్ ఒకటేనని అర్థమవుతోందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రి బండి సంజయ్‌ది ఫెవికాల్ బంధమని విమర్శించారు. వీళ్లిద్దరూ కలిసి వ్యాపారాలు చేస్తున్నారని, కుంభకోణాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అందుకే కేంద్రమంత్రి కొడుకుపై ఇంత పెద్ద నేరం మోపబడినా ప్రభుత్వం మిన్నకుండిపోయిందని అన్నారు.రాష్ట్ర పోలీసులు ఇప్పటికైనా ఒత్తిళ్లకు లొంగకుండా చట్టాన్ని గౌరవించాలని, బాధిత మైనర్ బాలికకు న్యాయం జరిగే వరకు తాము పోరాడుతామని స్పష్టం చేశారు.

## బీఆర్ఎస్ కీలక నేతలతో కేసీఆర్ భేటీ

-మొదటిపేజీ తరువాయి

అంతర్గత కమిటీల ఏర్పాటుపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపడానికి ఈ సంస్థాగత మార్పులు దోహదపడతాయని నాయకత్వం భావిస్తోంది. ఈ సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో పాటు, పార్టీ ప్రధాన కార్యదర్శులు, శాసనసభ, మండలి పక్షాల ప్రముఖ నేతలు పాల్గొన్నారు. హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, మధుసూదనాచారి, ఎల్. రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శులు తక్కెళ్లపల్లి రవీందర్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, బండ ప్రకాశ్ ముదిరాజ్, వి. గంగాధర్ గౌడ్, జోగినపల్లి సంతోశ్ కుమార్, నారదాసు లక్ష్మణరావు, ఆర్. శ్రవణ్ కుమార్ రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, టి. జీవన్ రెడ్డి, సోమా భరత్ కుమార్ గుప్తా, సత్యవతి రాథోడ్, రావుల చంద్రశేఖర్ రెడ్డి తదితరులు సమావేశానికి హాజరయ్యారు. ప్రత్యేక ఆహ్వానితులుగా సురేశ్ రెడ్డి, మహమూద్ అలీ, మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు మరియు ఇతర రాజకీయ సవాళ్లపై ఈ సమావేశంలో నేతలు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. అలాగే జిల్లా పర్యటనల ద్వారా క్యాడర్‌తో నేరుగా మమేకం కావాలని కేసీఆర్ సూచించినట్లు తెలుస్తోంది.

## తమిళ సిఎం విజయ్ సంచలన నిర్ణయం

-మొదటిపేజీ తరువాయి

ప్రస్తుతం తమిళనాడు రాష్ట్రంలో టాస్మాక్ 4,765 మద్యం దుకాణాలను నిర్వహిస్తోంది. వీటిలో 276 మద్యం దుకాణాలు ప్రార్థనా స్థలాల సమీపంలో, 186 విద్యా సంస్థల సమీపంలో, 255 బస్ స్టాండ్‌ల సమీపంలో ఉన్నాయి. వీటిని వెంటనే తొలగించాలని సీఎం ఆదేశించారు. కాగా మద్యం అమ్మకాల ద్వారానే రాష్ట్రానికి భారీగా ఆదాయం సమకూరుతోంది. అయినప్పటికీ.. ప్రజా సంక్షేమం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తమిళనాడు ప్రభుత్వం వెల్లడించింది. 2025 సంవత్సరంలో మద్యం అమ్మకాల ద్వారా రాష్ట్రానికి రూ.48,000 కోట్ల ఆదాయం వచ్చినట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఇకపోతే తమిళనాట దళపతి విజయ్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. వయసుతో సంబంధం లేకుండా అన్ని వర్గాల్లో ఆయనను అభిమానించే వారు ఉన్నారు. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే పార్టీ ఏకంగా 108 స్థానాల్లో విజయం సాధించింది. రెండు రోజుల క్రితం విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి ముఖ్యమంత్రి హోదాలో అసెంబ్లీకి వెళ్లారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టగానే తమిళనాడు సీఎంఓ ఆఫీస్ సోషల్ మీడియా ఖాతాల డీపీలు మారాయి. ముఖ్యమంత్రి విజయ్ ఫొటోలను డీపీలుగా పెట్టారు. విజయ్ ఫొటో డీపీగా పెట్టిన గంటల్లోనే మ్యాజిక్ జరిగింది. సోషల్ మీడియా ఖాతాలకు ఫాలోవర్స్ క్యూ కట్టారు. తమిళనాడు సీఎంఓ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాకు మొదట 4 లక్షల ఫాలోవర్స్ ఉండేవారు. విజయ్ ఫొటో పెట్టిన తర్వాత 16 లక్షలకు ఫాలోవర్స్ సంఖ్య పెరిగింది. ఇక ఎక్స్ ఖాతాకు కూడా 4 లక్షల మంది ఫాలోవర్స్ ఉండేవారు. ఇప్పుడు 22 లక్షల మంది అయ్యారు. అందుకే ఆయన తీసుకునే నిర్ణయాలకు ప్రజలు జై కొడుతున్నారు.

## పెండింగ్ డబుల్ బెడ్రూం ఇళ్లను లబ్ధిదారులకు ఇచ్చేందుకు స్పెషల్ డ్రైవ్

-మొదటిపేజీ తరువాయి

పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లను లబ్ధిదారులకు ఇచ్చేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ నగరంలో స్థలాలు ఉన్నవారికి ఈ నెలాఖరులోపు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ళ రెండో రెండో విడత పంపిణీ ప్రారంభిస్తామని తెలిపారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆదిలాబాద్‌లో ప్రారంభిస్తామని మంత్రి వెల్లడించారు. రెండో విడతకు సంబంధించిన విధివిధానాలను ఈ నెల 21న ఖరారు చేస్తామని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ళ కోసం స్థలాలను గుర్తించి ప్రతిపాదనలు సిద్దం చేయాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్‌లో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కఠినంగా వ్యవహరిస్తామని మంత్రి తెలిపారు.

## నీట్ పేపర్ లీకేజీకి కేంద్రానిదే బాధ్యత

-మొదటిపేజీ తరువాయి

ఉన్న బీజేపీ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష రద్దుతో విద్యార్థులు తమ అకడమిక్ ఇయర్‌ను కోల్పోయే అవకాశం ఉందన్నారు. నీట్ పరీక్ష రద్దుపై బీజేపీ ప్రభుత్వం చర్చ చేపట్టాలన్నారు. దేశంలో అనేక విషయాలపై చర్చ చేసే బీజేపీ విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశంపై సమాధానం చెప్పాలని ఎంపీ డిమాండ్ చేశారు. బీజేపీకి పాలనపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తు, సామాన్యుడి అవసరం బీజేపీకి వద్దా అని నిలదీశారు. నీట్ పరీక్ష రద్దుకు పూర్తిగా కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం డబ్బులు ఖర్చు పెట్టి కోచింగ్‌లు ఇప్పించి నీట్ పరీక్ష రాయించారని తెలిపారు. రాజస్థాన్‌లో నీట్ పేపర్ లీకేజీ ఘటనపై కేంద్రం పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలన్నారు. విద్యార్థుల అకడమిక్ ఇయర్ దెబ్బతినకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎంపీ చామల కిరణ్ రెడ్డి డిమాండ్ చేశారు.

## నీట్ ప్రవేశ పరీక్ష రద్దు

-మొదటిపేజీ తరువాయి

విద్యార్థుల ప్రయోజనాలు, జాతీయ పరీక్షా వ్యవస్థపై ఉన్న విశ్వాసాన్ని కాపాడేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్‌టీఏ వెల్లడించింది. కొత్త పరీక్ష కోసం విద్యార్థులు మళ్లీ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదని, పరీక్ష ఫీజు చెల్లించనక్కర్లేదని తెలిపింది. పరీక్ష తేదీలను నిర్ణయించిన తర్వాత మళ్లీ అడ్మిట్ కార్డులు విడుదల చేస్తామని పేర్కొంది. ఇక, ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్‌టీఏ తెలిపింది. ఈనెల 3న జరిగిన నీట్ పరీక్షలో కెమిస్ట్రీ విభాగంలో వచ్చిన సుమారు 120కి పైగా ప్రశ్నలతో ఉన్న ఓ ప్రాక్టీసు పేపరును గుర్తించినట్లు రాజస్థాన్ అదనపు డీజీపీ విశాల్ బన్సాల్ వెల్లడించారు. ఈ మెటీరియల్ రాజస్థాన్‌లోని సికార్‌లో పరీక్షకు 42 గంటల ముందు వాట్సాప్‌లో అందుబాటులోకి వచ్చినట్లు గుర్తించారు. ఇందులోని సమాచారం.. నీట్ ప్రశ్నపత్రంలోని 600 మార్కుల ప్రశ్నలతో పోలి ఉండటం గమనార్హం. కొన్ని ప్రశ్నల్లోని జవాబుల క్రమం కూడా అచ్చం ఒకేలా ఉండడం పలు అనుమానాలకు తావిచ్చింది. ఆ ప్రాక్టీసు పేపరు కేరళలోని ఓ వైద్య కళాశాలలో చదువుతున్న ఎంబీబీఎస్ విద్యార్థికి చెందినదిగా దర్యాప్తులో వెల్లడైంది. ఆ వ్యక్తి ఈనెల 1న సికార్‌లోని తన స్నేహితుడికి ఈ మెటీరియల్ ఇచ్చాడని.. ఆ తర్వాత అది పీజీ వసతిగృహాలు, కోచింగ్ నెట్‌వర్క్‌లు, కెరీర్ కౌన్సిలర్లు, పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు చేరిందని అధికారులు తెలిపారు. ఆ మెటీరియల్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీకి సంబంధించిన 300కు పైగా చేతిరాత ప్రశ్నలు ఉన్నాయని వెల్లడించారు. దీనిని విద్యార్థులకు రూ. 20వేల నుంచి రూ.2 లక్షల వరకు విక్రయించారని, కొందరు అభ్యర్థుల నుంచి ముందుగానే రూ. 30వేలకు పైగా వసూలుచేశారని గుర్తించామని రాజస్థాన్ పోలీసు అధికారులు పేర్కొన్నారు.

# సంపాదకీయం

## 'అర్బన్ నిక్సనైట్లు' ఉన్నారు జాగ్రత్త!



దాదాపు పది సంవత్సరాలుగా బి.జె.పి ప్రభుత్వం నోటినించీ, దాని సమర్ధకుల నోళ్ళ నించీ విరివిగా వినవస్తున్న మాట: 'అర్బన్ నక్సల్స్' లేదా 'అర్బన్ నక్సలైట్లు'. ఈ మాటని ప్రధానంగా, మావోయిస్టుల్ని సమర్ధించే పట్టణవాస మేధావుల్ని ఉద్దేశించి అంటారు. కానీ, ప్రధాని మోదీ దృష్టిలో, మావోయిస్టులే కాకుండా, తన ప్రత్యర్ధులైన రాహుల్‌గాంధీ, అరవింద్ కేజ్రీవాల్ కూడా 'అర్బన్ నక్సల్సే.' 'ఆపరేషన్ గ్రీన్ హంట్' పేరుతో, నక్సలైట్ల అణచివేతను సాగించిన పార్టీ నాయకుడు రాహుల్‌గాంధీ కూడా 'అర్బన్ నక్సలైటే'నా? ఎంత విచిత్రం? 'రాజకీయ పదాల డిక్షనరీ'లోకి కొత్తగా వచ్చిన ఈ పదం పుట్టుపూర్వోత్తరాలు చూడండి! 'అర్బన్ నక్సల్స్' అనే మాటని మొదట వాడినది 'వివేక్ అగ్నిహోత్రి' అనే సినిమా దర్శకుడు. ఈయనకి బి.జె.పి అనుకూలుడిగా, ప్రత్యేకించి మోదీ సమర్ధకుడిగా గుర్తింపు ఉంది. ఇతను తీసిన 'కాశ్మీర్ ఫైల్స్' అనే సినిమాని మోదీ చూడడమే కాకుండా, బి.జె.పి ఎమ్మెల్యేలు అందరూ చూడాలని సిఫార్సు చేసిన వార్త 2022 మార్చి 15న అన్ని పత్రికల్లోనూ, టీవీల్లోనూ వచ్చింది. ఏది ఏమైనా, శత్రు శిబిరానికి చెందిన మేధావుల్ని వర్ణించడానికి, ఒక కొత్త పదాన్ని సృష్టించాడూ అంటే, వివేక్ అగ్నిహోత్రిలో చెప్పుకోదగ్గ సృజనాత్మకత ఉందన్న మాట! ఇది ప్రశంసనీయం! అవును మరి, వర్గ సమాజంలో, కవులూ కళాకారులు, తమ సృజనాత్మకతని, తమ తమ వర్గ ప్రయోజనాలకు అనుకూలంగా ఉపయోగించడం సహజం. దానికి తగిన ప్రతిఫలం పొందడం కూడా సహజం. మార్చి 9న విడుదలైన ఆ సినిమాని, మోదీ 15న వీక్షించి, 'ఇటువంటి సినిమాలు మరిన్ని రావాలి' అని ప్రకటించిన తర్వాత, ఆ సంవత్సరపు ఉత్తమ చిత్రంగా, ఆ మరుసటి సంవత్సరం ప్రభుత్వ సినిమా అవార్డుల కమిటీ ప్రకటించింది. 'రాజు తలుచుకుంటే...' అంటారే, అలాగ! ఇంక ఇప్పుడు, అసలు 'నక్సలైట్లు' అనే పదం ఎలా పుట్టిందో చూడాలి. 1967 మార్చిలో, పశ్చిమ బెంగాల్‌లో, నక్సల్బరీ అనే ప్రాంతంలో కొంతమంది కమ్యూనిస్టులు ప్రారంభించిన ఉద్యమానికి 'నక్సల్బరీ ఉద్యమం' అనే పేరు వచ్చింది. ఆ ఉద్యమాన్ని నడిపిన వారినీ, దాని సమర్ధకుల్నీ ఇంగ్లీషులో 'నక్సలైట్స్' అనడం మొదలైంది. అదే పదాన్ని, తెలుగుతో సహా దాదాపు అన్ని భాషల్లోనూ వాడుతున్నారు. హిందీ లాంటి భాషల్లో, దానికి తోడు, 'నక్సల్ వాది' లాంటి మాటలు కూడా వాడతారు. నక్సలైట్ అనే పదంలో, 'నక్సల్' అనే మాట, 'నక్సల్ బరీ' నించీ తీసుకున్నది. '--ఐట్' అనేది ఇంగ్లీషు వ్యాకరణంలో ఒక 'సఫిక్స్'. తెలుగు వ్యాకరణ భాషలో, 'ప్రత్యయం'. 'ఐట్' అనే ముక్కని, ఇంగ్లీషులో, ఒక మాటకి చివరిలో చేర్చితే, అది ఆ మాటకి ఉన్న గుణాన్ని లేదా సంబంధాన్ని తెలియపరుస్తుంది. 'నక్సలైట్' అంటే, నక్సల్బరీ ప్రాంతానికి లేదా ఉద్యమానికి సంబంధించిన వ్యక్తి అని అర్థం. 1969 నాటికి ఈ పదం బాగా వ్యాప్తిలోకి వచ్చింది, పత్రికల వార్తల్లోనూ, ఇతర రకాల వ్యాసాలలోనూ. (అదే సమయంలో, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమంలో పాల్గొంటున్న వారిని, స్తానిక ఇంగ్లీషు పత్రికలు, 'తెలంగనైట్స్' అని ప్రస్తావించేవి. తెలంగాణంఐట్=తెలంగనైట్.) 1967--1970 మధ్య ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీలో, బియ్యేలో మూడు సబ్జెక్టులలో, ఒకటి 'లింగ్విస్టిక్స్' (భాషా శాస్త్రం). దానిలో, అనేక విషయాలతో పాటు, పదాలు ఎలా ఏర్పడతాయి--అనే సంగతులు కూడా, మా లెక్చరర్లు చెప్పేవారు. (అలాంటి వాటిలో, 'ఎనలాజికల్ క్రియేషన్' అని ఒక పద్ధతి ఉంది. దీన్ని కష్టమైన తెలుగు వ్యాకరణ భాషలో 'సారూప్య పద సృష్టి' అంటారనుకుంటాను. అదేమిటంటే, భాషలోనే ఉన్న ఒక మాటని ఆధారం చేసుకుని, ఆ మాటలో ఉన్న శబ్దాల్ని పోలివున్న ఇంకో పదాన్ని సృష్టించడం. ఆ కొత్త పదానికి ఉండే అర్థం, పాత పదానికి ఉన్న అర్థం నించీ తేడాగా ఉంటుంది. (ఇక్కడ ఇంతకన్న వివరాలు చెప్పుకోలేము.) అప్పట్లో మాకు పాఠాలు చెప్పిన వారిలో ఒకరైన చేకూరి రామారావు, పదాలు ఏర్పడే పద్ధతి గురించి చెపుతూ, ఒక కొత్త పదాన్ని ఉదాహరణగా చెప్పారు. అదే, 'నిక్సనైట్లు' అనే పదం! 'నిక్సనైట్లు' అంటే, నక్సలైట్లను వ్యతిరేకించేవారు--అని అర్థం. ఈ చమత్కార పదాన్ని సృష్టించింది శ్రీశ్రీ. దీనికి ఒక సందర్భం ఉంది. నక్సలైటు ఉద్యమం బాగా వార్తల్లో ఉన్న రోజుల్లో, రిచర్డ్ నిక్సన్ అమెరికాకి అధ్యక్షుడిగా (1969 జనవరిలో) వచ్చాడు. పెట్టుబడిదారీ అమెరికాకు అధ్యక్షులైన వారందరిలాగే నిక్సన్ కూడా కమ్యూనిజానికి సహజ వ్యతిరేకి. కమ్యూనిస్టులు ఏ రూపంలో ఉన్నా వ్యతిరేకించే వారిని ఉద్దేశించి, తెలుగులో 'అభినవ శబ్ద వాంగ్మయ బ్రహ్మ' అనదగ్గ శ్రీశ్రీ, 'నిక్సనైట్లు' అనే పదాన్ని వాడడం మొదలు పెట్టాడు. 30--5--1969 నాటి, 'ప్రగతి' వారపత్రికలో, ఒక పాఠకురాలు అడిగిన ప్రశ్న: "నక్సలైట్లంటే అర్థమేమిటండీ?" దానికి, శ్రీశ్రీ జవాబు: "నిక్సనైట్లకి సింహ స్వప్నం." నిక్సన్ అధ్యక్ష పదవిలోకి వచ్చిన అయిదు నెలలకి, అభినవ 'వాగనుశాసనుడు'గా, 'కవి బ్రహ్మ'గా, రోణంకి అప్పలస్వామి వంటి బహుభాషా పండితుల చేత ప్రశంసలు పొందిన శ్రీశ్రీ, మరుసటి యేడాది నక్సలైట్ల గురించి ఒక పద్యం ఇలా రాశాడు: "సమాజ శస్త్ర వైద్యులు/ విచిత్ర వీరులు/ అన్యాయాలకి డైనమైట్లు/ అంధకారంలో టార్చిలైట్లు/ నవయువ జీవన కాస్మోనాట్లు/ వాళ్ళంటే హడిలిపోతారు నిక్సనైట్లు." (జ్యోతి, మాసపత్రిక, ఆగస్టు, 1970). 'నిక్సనైట్లు' అన్న పదం గురించి ఎందుకు ఇప్పుడు ప్రస్తావిస్తున్నానంటే, నక్సలైట్ల నిర్మూలన పూర్తైనట్టేననీ, ఇక అర్బన్ నక్సలైట్ల పని పడతామనీ, హోమ్ మంత్రి అమిత్ షా ప్రకటన, మార్చి 30న, పార్లమెంటులో వచ్చింది. ఈ ప్రకటననే, కొందరు 'అర్బన్ నిక్సనైట్లు' ఇలా పునరుద్ఘాటిస్తున్నారు: "ఇప్పుడు అర్బన్ నక్సలైట్ల అణచివేతపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిన సమయం ఆసన్నమైంది"-- అని! 'నిక్సనైట్లు' అనే పదానికి, 'అర్బన్' అనే విశేషణాన్ని తగిలించి, 'అర్బన్ నిక్సనైట్లు' అనే పదబంధాన్ని నేను వాడడానికి కారణం వివరించి ముగిస్తాను. దండకారణ్యం అడవుల్ని సర్వనాశనం చేసి, పర్యావరణ విధ్వంసానికి దారితీసే, గనుల తవ్వకాలకి కాంట్రాక్ట్ తీసుకున్న కార్పొరేట్ సంస్థల యజమానుల్ని 'నిక్సనైట్లు' అనవచ్చును. ఆ ఫారెస్టు నిక్సనైట్లను, ఇక్కడ పట్టణాలలో కూచుని సమర్ధించే వాళ్ళని 'అర్బన్ నిక్సనైట్లు' అనవచ్చును. వాళ్ళు సమర్ధించి ఊరుకుంటే ఫరవాలేదు. కానీ, వాళ్ళు 'అర్బన్ నక్సలైట్ల'ని హెచ్చరిస్తున్నారు. అందుకే, ఈ వ్యాసానికి పేరు: 'అర్బన్ నిక్సనైట్లు ఉన్నారు జాగ్రత్త!' మరి, అర్బన్ నక్సలైట్లు ఏమంటారో? 1979 నాటి పాకిస్తాన్ నియంత జియా--ఉల్--హక్ పాలనను దృష్టిలో పెట్టుకుని, కమ్యూనిస్టు కవి ఫైజ్ అహ్మద్ ఫైజ్ రాసిన 'హం దేఖెంగే'--అనే పాటలోని చరణాలతో జవాబు ఇస్తారా? "పీడకుల కిరీటాలు ఉరుముల గర్జనలో నేలకొరిగిపోతాయి!" అని!

# దక్షిణాపథంలో బీజేపీ జైత్రయాత్ర ఎప్పుడు







కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో కొన్ని దశాబ్దాల పాటు ఎర్ర కెరటాలు ప్రతి ఏటా ఉప్పొంగేవి. కానీ ఈ మే 9న కాషాయ అలలు పరవళ్లు తొక్కాయి. ప్రధానమంత్రి మోదీ, వేలాది ప్రజల సమక్షంలో సువేందు అధికారి బీజేపీ తొలి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. సరిగ్గా ఒక రోజు తర్వాత ఆదివారంనాడు దక్షిణాదిన చెన్నైలో జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో సినీనటుడు చంద్రశేఖరన్ జోసెఫ్ విజయ్ జాతీయ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ సమక్షంలో తమిళనాడు 9వ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. విజయ్ పట్టాభిషేకానికీ అంతే భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. హిందీ మాట్లాడే రాష్ట్రాల్లో బలంగా వేళ్లూనుకుని, పశ్చిమాన గుజరాత్, మహరాష్ట్రల్లో, ఈశాన్య రాష్ట్రాలైన అసోం, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, త్రిపురలో, తూర్పు, కోస్తా ప్రాంతంలో తొలుత ఒడిషా, ఇప్పుడు బెంగాల్‌లో విస్తరించిన భారతీయ జనతా పార్టీ దక్షిణాదిలో అడుగుపెట్టడం అంత సులభం కాదని ఈ పరిణామం స్పష్టం చేస్తోంది. అటు సువేందు అధికారి, ఇటు జోసెఫ్ విజయ్ ఈ పరిణామాలకు ప్రతిఫలనాల్లా కనిపిస్తున్నారు. ఈ రెండు ఘట్టాలు భారత దేశ ప్రజల ఆలోచనా దృక్పథంలో రెండు భిన్న కోణాలను ప్రతిబింబిస్తున్నాయా బెంగాల్‌లో సువేందు అధికారి పక్కన నిలబడిన నరేంద్రమోదీ ఇప్పుడు దక్షిణాదిలో విస్తరించేందుకు ఉవ్విళ్లూరుతుంటే, కేరళలో విజయం సాధించి, జోసెఫ్ విజయ్ పక్కన నిలబడ్డ రాహుల్‌గాంధీ ఉత్తరాదిలో పూర్వవైభవాన్ని సంతరించుకునేందుకు ఎన్ని యత్నాలు చేసినా ఫలితాలు సాధించలేకపోతున్నారు. ఒకప్పుడు కాంగ్రెస్‌ను ప్రతిఘటించిన దక్షిణాది రాష్ట్రాలు బీజేపీని ఏమంత ఆహ్వానించలేదు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో బీజేపీ ప్రవేశించేందుకు చేయని ప్రయత్నం లేదు. అమలు చేయని ప్రయోగం అంటూ లేదు. ఏపీలో తెలుగుదేశం ఆధిపత్యాన్ని అంగీకరించిన బీజేపీ కర్ణాటకలో ఉన్న అధికారాన్ని కోల్పోయి, మళ్లీ పట్టుకోసం నానా యత్నాలు చేస్తోంది. తమిళనాడులో స్వంతంగా బలపడడం కష్టమని గ్రహించిన తర్వాత మళ్లీ అన్నాడీఎంకేతో చేతులు కలపక తప్పలేదు. కేరళలో ఈ అసెంబ్లీ ఎన్నికల్లో మొదటిసారి 3 సీట్లు సాధించిన బీజేపీ ఓట్ల శాతం మాత్రం గతంతో పోలిస్తే ఏమంత పెరగలేదు. కేరళ, తమిళనాడులో బీజేపీ ప్రవేశించడం సుదూర స్వప్నమైతే అవకాశం ఉన్న రాష్ట్రాలు కర్ణాటక, తెలంగాణ మాత్రమే. అందుకే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అయిదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే ఈ రెండు రాష్ట్రాల్లో పర్యటించారు. అయితే కర్ణాటక, తెలంగాణల్లో మోదీ పర్యటన భిన్న రీతుల్లో సాగింది. కర్ణాటకలో జాతీయవాద రాజకీయాలవైపు ప్రజలు మొగ్గుచూపుతున్నారని, త్వరలో కాషాయ ప్రభంజనం ఆ రాష్ట్రంలో వీస్తుందని చెప్పిన మోదీ తెలంగాణలో మాత్రం ఆ విశ్వాసాన్ని ప్రకటించలేదు. 1984లో దేశ వ్యాప్తంగా కేవలం బీజేపీ గెలుచుకున్న రెండు స్థానాల్లో ఒకటి గుజరాత్‌లోని మెహసానా కాగా, రెండవది తెలంగాణలో హన్మకొండ. ఇప్పుడు గుజరాత్‌తో పాటు దేశంలోని అనేక రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి రాగా, తెలంగాణలో మాత్రం అనుకున్నంతమేరకు విస్తరించలేకపోతోంది. ఈ విషయాన్ని స్వయంగా మోదీయే రాష్ట్ర నేతల దగ్గర ప్రస్తావించి వారిని విమర్శించారు. బండి సంజయ్ అధ్యక్షుడుగా ఉన్నప్పుడు బీజేపీ కేడర్‌లో కొంత ఊపు వచ్చింది కాని ఆ తర్వాత ఆ ఉత్సాహం క్రమంగా నీరుకారిపోయింది. సంఘ్ పరివార్ సంస్థలైతే హిందూత్వ దిశగా ప్రజల్ని మళ్లించగలవు కాని రాజకీయంగా ప్రజల్లో కదలిక తేవాల్సింది బీజేపీ నేతలే. మోదీ తాజా పర్యటనలో బీజేపీ నేతలకు బహిరంగంగా ఎలాంటి దిశానిర్దేశం చేయలేదు. ఉత్తరాది, బెంగాల్‌లో అవలంబించిన పద్ధతులు దక్షిణాదిన పనిచేయవని ఆయనకు తెలుసు. అయితే తెలంగాణకు సంబంధించి మోదీ వద్ద ఏదో వ్యూహమే ఉన్నట్లు ఆయన మాటలు, సమావేశాలు అనుమానాలు కలిగిస్తున్నాయి. అదేమిటో కాలమే చెబుతుంది. బెంగాల్‌లో బీజేపీ విజయంతో మమతా బెనర్జీ తర్వాత కమలనాథులను ఢీకొనగల శక్తులంతా ఒక్కొక్కరూ మాయవుతున్నట్లు కనిపిస్తోంది. అదే సమయంలో జాతీయ పార్టీ కాంగ్రెస్ అయినా కనీసం బీజేపీని ఢీకొనగలదా అన్న ప్రశ్న తలెత్తుతోంది. బీజేపీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలను ఐక్యం చేసేందుకు ప్రయత్నించిన నాయకులు అందరూ ఒక్కొక్కరూ కుప్పకూలిపోయారు. నితీశ్‌కుమార్, మమతా బెనర్జీ, ఎంకే స్టాలిన్, కేసీఆర్, శరద్‌పవార్, కేజ్రీవాల్, ఉద్ధవ్ ఠాక్రే అందరూ మోదీని వ్యతిరేకించి ప్రతిపక్షాలను ఏకం చేయాలనుకున్నవారే. 2023లో ప్రతిపక్షాలను ఏకం చేసేందుకు తీవ్ర యత్నాలు చేసిన నితీశ్ తర్వాత అధికారం కోసం బీజేపీ వైపు మళ్లి, ఇప్పుడు బీజేపీకే అధికారాన్ని వదులుకున్నారు. దేశంలో ప్రత్యామ్నాయ రాజకీయాలు చేయగలిగిన నేతల నందరినీ మోదీ చతుర్విధోపాయాలు ఉపయోగించి పక్కకు తప్పించారు. వీరెవరూ జాతీయ స్థాయిలో ఇప్పుడు మోదీని ఎదుర్కోగలిగేందుకు చేయగలిగింది ఏమీ లేకపోగా, రాష్ట్ర స్థాయిలో మనుగడకు పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మహారాష్ట్రలో శివసేన, ఎన్‌సీపీని చీల్చి ప్రాబల్యం సంపాదించిన బీజేపీ ఆమ్ ఆద్మీ పార్టీలో కూడా తిరుగుబాటును ప్రేరేపించింది. తమిళనాడులో కొత్త శక్తి ఆవిర్భవించినప్పటికీ లోక్‌సభ ఎన్నికలు జరిగే వరకు ఈ శక్తి తన బలం ఎంతమేరకు పుంజుకుంటుందో ఇప్పుడే చెప్పలేం. వామపక్షాలకు ఉన్న ఏకైక ప్రభుత్వం ఇప్పుడు కాంగ్రెస్ వశమైంది. పార్లమెంటులో వామపక్షాల ఉనికి క్రమంగా క్షీణించిపోతోంది. ప్రాంతీయ పార్టీలు, వామపక్షాలు బలహీనపడంతో బీజేపీని కాంగ్రెస్ మాత్రమే ఒంటరిగా ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. బహుశా బీజేపీ కూడా అదే కోరుకుంటుందేమో. బీజేపీ వ్యతిరేక రాజకీయాలు బలహీనపడడమో, ఆవశ్యకత కోల్పోవడమో స్పష్టంగా కనపడుతోంది. అది నాయకత్వస్థాయిలోనూ, సైద్ధాంతిక స్థాయిలోనూ ప్రస్ఫుటిస్తోంది. దానివల్ల దక్షిణాదిలో కూడా బీజేపీతో చేతులు కలిపేందుకు, దాని రాజకీయ సిద్ధాంతాన్ని ఆమోదించేందుకు పార్టీలు ఏ మాత్రం వెనుకాడడం లేదు. బీజేపీ వ్యతిరేకత సోషల్ మీడియా కాగితపు పులులకు మించి జనంలోకి వ్యాపించేందుకు ఎంత సమయం పడుతుందో చెప్పలేము. స్వాతంత్ర్యం తర్వాత దశాబ్దాలపాటు రాజ్యమేలిన కాంగ్రెస్ ఆ తర్వాత క్రమంగా బలహీనపడింది. అప్పుడు జనసంఘ్, బీజేపీ పరిస్థితి ఏ విధంగా ఉన్నదో ఇప్పుడు కాంగ్రెస్ పరిస్థితి కూడా అదే విధంగా మారింది. కేవలం రెండేళ్లలో బీజేపీ తూర్పున ఒడిషా, బిహార్, పశ్చిమబెంగాల్‌లో అధికారంలోకి రాగలిగింది. అసోంలో మూడోసారి అధికారాన్ని చేజిక్కించుకుంది. పశ్చిమాన రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్రలో బీజేపీకి స్వంత ముఖ్యమంత్రులున్నారు. గుజరాత్‌లో 30 ఏళ్లుగా బీజేపీ అధికారంలో ఉన్నది. ఒక్క జార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్ తప్ప హిందీ బెల్ట్ అంతటా బీజేపీ ముఖ్యమంత్రులున్నారు. పంజాబ్‌లో కూడా ఇప్పటికే బీజేపీ చాపక్రింద నీరులాగా ప్రవేశించేందుకు పథకాలు మొదలుపెట్టింది. ఉత్తర, తూర్పు, పశ్చిమాన ఆధిపత్యం నిరూపించుకోగలిగిన బీజేపీకి దక్షిణాదిలో ప్రవేశించడం అసాధ్యమా? అయితే ఎన్నికల రాజకీయాల్లో బీజేపీ ఎంత తలపండిపోయిందంటే ఆ పార్టీని ఓడించడం అసాధ్యమనే స్థితి ఏర్పడింది. ఎన్నికల్లో బీజేపీ విజయ సూత్రాన్ని ఎవరూ ఛేదించలేకపోతున్నారు. గెలిచేందుకు ఏ సాధనాన్ని బీజేపీ వదిలిపెట్టదు, అది నైతికమా, అనైతికమా అన్న చర్చతో ఆ పార్టీకి నిమిత్తం లేదు. 'సర్' వల్ల 31 స్థానాల్లో బీజేపీ తమపై గెలిచిందని తృణమూల్ కాంగ్రెస్ నేతలే అంగీకరించినందువల్ల మిగతా స్థానాల్లో గెలిచేందుకు బీజేపీ ఇతర వ్యూహాలు ప్రయోగించి ఉండాలి. పార్టీకైనా ఎల్లకాలమూ శిఖర స్థాయిలో ఉండడం సాధ్యం కాదు. బీజేపీ ఆ స్థాయి కోల్పోవాలంటే తన పతనానికి తానే కారణం కావాలి. ఆ పార్టీని గద్దెదించగల ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి ఆవిర్భవించాలి. ప్రజలు అడుగడుగునా వ్యతిరేకించగల పరిస్థితులు రావాలి. ఈ మూడూ సమీప భవిష్యత్తులో జరిగే అవకాశాలు కనపడడం లేదు. సాధారణంగా ప్రభుత్వ పాలన పట్ల కనపడే వ్యతిరేకతను కూడా బీజేపీ అధిగమించింది. ప్రభుత్వ వ్యతిరేకతను తటస్థం చేయడంలో బీజేపీ నేతలు దిట్టలు. అసోంలో రెండుసార్లు అధికారంలో ఉన్న తర్వాత కూడా కాంగ్రెస్ బీజేపీని ఓడించకపోగా ముఖ్యమంత్రి పదవికి అభ్యర్థి, మూడుసార్లు ఎంపీ అయిన గౌరవ్ గొగోయ్ కూడా 23వేల ఓట్ల తేడాతో ఓడిపోయారంటే ఏమనాలి? 2029లో సార్వత్రక ఎన్నికలు జరిగే లోపు బీజేపీని ఓడించగల సత్తాను ప్రతిపక్షాలు ఎంత మేరకు సాధించగలుగుతాయో చెప్పలేం. కేరళలో వామపక్షాలను ఓడించి, బెంగాల్‌లో వామపక్షాలతో తృణమూల్‌ను దెబ్బతీసేందుకు ప్రయత్నించిన కాంగ్రెస్‌తో జాతీయ స్థాయిలో ఎన్ని పార్టీలు కలిసి వస్తాయో చెప్పలేం. అన్ని పార్టీలు మళ్లీ చేతులు కలిపినా బీజేపీని ఓడించగల సైద్ధాంతిక భూమిక, నాయకత్వాన్ని అవి ఏర్పర్చుకోవడం సులభం కాదు. జయప్రకాశ్ నారాయణ్, వీపీ సింగ్ వంటి నాయకులు అవతరించే అవకాశం లేదు. నిజానికి దేశంలో అనేక ప్రాంతీయ పార్టీలు సాధించిన ఓట్లన్నీ ఒకప్పుడు కాంగ్రెస్‌వే. ఈ ప్రాంతీయ పార్టీలు బలహీనపడితే కాంగ్రెస్ మళ్లీ ఆ ఓట్లను సాధించుకోగలగాలి. కానీ కాంగ్రెస్ ఆ శక్తిని సంపాదించుకోలేకపోతోంది. హిందూత్వ రాజకీయాల విషయంలో బీజేపీకి పోటీ లేదు. సంస్థాగత నిర్మాణం విషయంలో కాంగ్రెస్ బీజేపీతో పోటీపడలేకపోతోంది. బీజేపీతో ముఖాముఖి పోటీలో నెగ్గగలమన్న విశ్వాసాన్ని కాంగ్రెస్ కల్పించలేకపోతోంది. వచ్చే రెండేళ్లలో ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, కర్ణాటక, తెలంగాణ తదితర రాష్ట్రాల్లో జరిగే ఎన్నికలు ఏ సందేశాన్నిస్తాయి

# ప్రధాని వ్యాఖ్యలకు కాంగ్రెస్ నేతలు ఫైర్

- ప్రధాని వ్యాఖ్యలపై నాగిరెడ్డి ఫైర్..
-సీఎం రేవంత్‌కు మద్దతుగా కాంగ్రెస్ గళం..
-నిధులపై రాజకీయాలు వద్దన్న నాగిరెడ్డి..
-తెలంగాణ తలవంచదన్న కాంగ్రెస్ నేత..
-పార్టీలోకి రా వ్యాఖ్యలపై ఆగ్రహం..
-మోదీ అహంకారానికి తెలంగాణ కౌంటర్..

కూకట్‌పల్లి, మే 12 ( హంసకలం వార్త )

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణ గడ్డపై చేసిన వ్యాఖ్యలు దేశ ప్రధానిగా ఉన్న హోదాకు మచ్చ తెచ్చేలా ఉన్నాయని కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు డాక్టర్ పి. నాగిరెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నిధులు కోరితే, రాజకీయాలు చేయడం ప్రధానమంత్రి స్థాయికి తగదని విమర్శించారు. మోదీ వ్యాఖ్యలను ఖండిస్తూ నాగిరెడ్డి సోమవారం ప్రకటన విడుదల చేశారు..

-మన్మోహన్ సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి.. మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్, హయాంలో గుజరాత్ అభివృద్ధికి కేంద్రం భారీగా నిధులు ఇచ్చిందని నాగిరెడ్డి గుర్తు చేశారు. ఆ నిధులతోనే నేడు గుజరాత్ మోడల్ అంటూ ప్రచారం చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. దేశ ప్రధానిగా అన్ని రాష్ట్రాలను సమానంగా చూడాల్సిన బాధ్యత మోదీపై ఉందన్నారు. తెలంగాణ విజన్ 2047 కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హుందాగా నిధులు కోరితే, దానికి రాజకీయ రంగు పులమడం దురదృష్టకరమని విమర్శించారు..

- మా పార్టీలోకి రా..అనడం హేయం..

నిధులు కావాలంటే మా పార్టీలో చేరాలని ముఖ్యమంత్రిని బహిరంగంగా సూచించడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని నాగిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాలు మాట్లాడొద్దని చెప్పే ప్రధానే.. రంగులు మార్చమని సూచించడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు బహిరంగ సభల్లో చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ధ్వజమెత్తారు..

-తెలంగాణ గడ్డపై అహంకారం సహించం..

తెలంగాణ ముఖ్యమంత్రిని లొంగిపోవాలని హెచ్చరించడం రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిందని నాగిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు ఎవరి ముందు తలవంచే వారు కాదని, జీ హుజూర్ అనే బానిస మనస్తత్వం ఈ నేలకేదీ కాదని స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాల్లో చూపే



అహంభావాన్ని తెలంగాణపై ప్రదర్శిస్తే ప్రజలు సహించరని హెచ్చరించారు. ప్రధానమంత్రి హోదాలో బాధ్యతాయుతంగా మాట్లాడాలని నాగిరెడ్డి సూచించారు..

# బండి సంజయ్ రాజీనామా చేయాలి..కేపీ వివేకానంద్ ఫైర్

జగద్గిరిగుట్ట, మే 12 ( హంసకలం వార్త )

జగద్గిరిగుట్ట డివిజన్ 126లో నిర్వహించిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పోక్సో కేసులో బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ పేరు వచ్చినప్పటికీ మూడు రోజులుగా అరెస్టు చేయకపోవడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి పోలీసు వ్యవస్థను తన గుప్పిట్లో పెట్టుకుని కేసును నీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. మైనర్ బాలికకు సంబంధించిన కేసులో నిష్పక్షపాత విచారణ జరగాలంటే బండి సంజయ్ వెంటనే పదవి నుంచి తప్పుకోవాలని కేపీ వివేకానంద్ డిమాండ్ చేశారు. లేకపోతే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆయనను వెంటనే బర్తరఫ్ చేయాలని స్పష్టం చేశారు. బండి భగీరథ్ స్వయంగా బాలికతో కలిసి తిరిగినట్లు ఒప్పుకున్నాడని, అయినప్పటికీ కేసును మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. గంగుల కమలాకర్ చేతిలో పలుమార్లు ఓడిపోయిన బండి సంజయ్ రామమందిరం పేరుతో మాత్రమే రాజకీయంగా ఎదిగాడని కేపీ వివేకానంద్ విమర్శించారు. ఒకప్పుడు చందాలు వసూలు చేసిన వ్యక్తికి నేడు వందల కోట్ల రూపాయలు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ధర్మం పేరుతో బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తూ రేవంత్ రెడ్డితో చీకటి ఒప్పందాలు చేసుకుంటున్నారని ఆరోపించారు. బండి సంజయ్ కుమారుడు బాలిక కుటుంబాన్ని బెదిరించాడనే ఆధారాలు ఉన్నాయని, ఈ కేసు ఎఫ్ఐఆర్‌లో బండి సంజయ్ పేరును కూడా చేర్చాలని డిమాండ్ చేశారు. పేదలకు ఒక న్యాయం, అధికారులకు మరో న్యాయమా అని ప్రశ్నించిన కేపీ



వివేకానంద్, బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని ప్రకటించారు. ఢిల్లీలో కుస్తీ, గల్లీలో దోస్తీ అన్నట్టుగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు నాటకాలు ఆడుతున్నాయని, త్వరలోనే ప్రజల ముందుకు నిజాలు తీసుకొస్తామని కేపీ వివేకానంద్ హెచ్చరించారు..

# ఆర్టీసీ ఉద్యోగుల్లో ఉత్కంఠ

-ఆర్టీసీ 32 డిమాండ్లు వెంటనే అమలు చేయాలన్న జేఏసీ హెచ్చరిక..
-జూన్ 2న ఉద్యోగుల విలీన తేదీ ప్రకటించాలని డిమాండ్..
-సమ్మె రోజుల జీతాలపై రేవంత్ రెడ్డి, పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు..
-శంకర్ గౌడ్ కుటుంబానికి ఉద్యోగుల జీతాల నుంచి విరాళం నిర్ణయం..

హైదరాబాద్, మే 12 ( హంసకలం వార్త )

టీజీఎస్ఆర్టీసీ జేఏసీ అత్యవసర సమావేశం ఎంప్లాయిస్ యూనియన్ కేంద్ర కార్యాలయంలో ఘనంగా జరిగింది. సమావేశానికి జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ ఎం థామస్ రెడ్డి, కో కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి యాదగిరి హాజరై కీలక వ్యాఖ్యలు చేశారు. సమ్మె విరమణ సమయంలో ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం అంగీకరించిన 32 డిమాండ్లను ఇకపై ఆలస్యం చేయకుండా వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియలో భాగంగా జూన్ 2న అపాయింటెడ్ డేట్ ప్రకటించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్టీసీ ఉద్యోగుల విలీనంపై సానుకూలంగా స్పందించడం పట్ల జేఏసీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. మూడు రోజుల సమ్మె కాలానికి జీతాలు చెల్లించేందుకు ప్రభుత్వం, యాజమాన్యం అంగీకరించడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు జేఏసీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. నర్సంపేట డిపో అమరుడు డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబానికి ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగుల మే నెల జీతాల నుంచి రూ.300 చొప్పున విరాళం అందించే ప్రతిపాదనకు మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి



అంగీకరించడం అభినందనీయమన్నారు. 01-04-2021 నుంచి 11 శాతం వేతన సవరణ అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో మాస్టర్ స్కేల్ వర్తింపజేయాలని, కొత్త జీతాలను జూన్ నెల వేతన బిల్లుతో చెల్లించాలని జేఏసీ నేతలు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో కె.రాంరెడ్డి, జి.రాములు, బుద్ధ విశాల్, అక్తర్ పాషా, వి.లింగయ్య తదితరులు పాల్గొన్నారు..

# శేరిలింగంపల్లిలో మంచినీటి కోసం ప్రజల అరుపులు

-నీటి ఎద్దడిపై బీసీ ఐక్యవేదిక ఫైర్..
-శేరిలింగంపల్లిలో మంచినీటి సమస్య తీవ్రం..
-ట్యాంకర్లతో నీటి సరఫరా చేయాలంటూ డిమాండ్..
- డ్రైనేజీ సమస్యలపై అధికారులకు వినతిపత్రం..

శేరిలింగంపల్లి, మే 12 ( హంసకలం వార్త )

వేసవి ఎండలు తీవ్రరూపం దాల్చడంతో శేరిలింగంపల్లి పరిధిలోని పలు కాలనీల్లో తీవ్రమైన మంచినీటి సమస్య నెలకొన్న నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు బేరి రామచంద్ర యాదవ్ ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. గుల్మోహర్ పార్క్, నేతాజీ నగర్‌తో పాటు పలు కాలనీల్లో తాగునీటి కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లోతట్టు ప్రాంతాల్లో అధికంగా నీటి వినియోగం జరుగుతుండటంతో ఎత్తు ప్రాంతాలకు నీటి సరఫరా అందడం లేదని పేర్కొన్నారు. నల్లగండ్ల చెరువు నుంచి నేతాజీ నగర్ సాయిబాబా ఆలయం వరకు కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేసి, మధ్య మధ్యలో నియంత్రణ ట్యాపులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నీటి సమస్య తీవ్రంగా ఉన్న కాలనీలకు ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయాలని కోరారు. అదేవిధంగా పలు కాలనీల్లో డ్రైనేజీ సమస్యలు కూడా ప్రజలను



ఇబ్బందులకు గురిచేస్తున్నాయని, వెంటనే శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. శేరిలింగంపల్లి పరిధిలోని అన్ని కాలనీలను పరిశీలించి ఎక్కడ నీటి ఎద్దడి ఉందో గుర్తించి సమర్థవంతమైన నీటి సరఫరా చేపట్టాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ ఫెడరేషన్ అధ్యక్షుడు ఆర్కే సాయన్న ముదిరాజ్, యువజన నాయకుడు చంద్రశేఖర్ యాదవ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు..

# హైదర్‌నగర్ అభివృద్ధిపై నార్నె ఫోకస్



హైదర్‌నగర్, మే 12 ( హంసకలం వార్త )

హైదర్‌నగర్ డివిజన్ అభివృద్ధిపై మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు ప్రత్యేక దృష్టి సారించారు. జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్, శానిటేషన్ అధికారులతో పాటు కాలనీ వాసులతో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించి సమస్యలను పరిశీలించారు. ఓపెన్ జిమ్ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని పరిశీలించి, ప్రజలకు ఉపయోగపడే విధంగా త్వరితగతిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కాలనీల్లో నెలకొన్న డ్రైనేజీ, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల సమస్యలపై స్థానికులతో చర్చించి, వెంటనే పరిష్కార చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులు, తన దృష్టికి వచ్చిన సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని అత్యవసర ప్రాంతాల్లో పనులు పూర్తి చేస్తామని నార్నె శ్రీనివాసరావు తెలిపారు. హైదర్‌నగర్ డివిజన్‌ను సమస్యల రహిత, ఆదర్శవంతమైన అగ్రగామి డివిజన్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తూ మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు కృషి కొనసాగిస్తానన్నారు. ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉంటూ ప్రతి చిన్న సమస్యను పరిష్కరించేందుకు కట్టుబడి పనిచేస్తానని స్పష్టం చేశారు..

# కూకట్‌పల్లిలో హనుమాన్ భక్తి సందడి



కూకట్‌పల్లి, మే 12 ( హంసకలం వార్త )

పవనపుత్ర హనుమాన్ జయంతిని పురస్కరించుకుని కూకట్‌పల్లి నియోజకవర్గంలోని పలు హనుమాన్ ఆలయాలను బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు సందర్శించారు. ఆలయాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు రాజేశ్వరరావుకు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమంతుడు భక్తి, శక్తి, సేవాభావానికి ప్రతీక అని పేర్కొన్నారు. శ్రీరాముడిపై హనుమంతుడి అచంచల భక్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు. యువత దేశభక్తి, ధర్మ పరిరక్షణ, సేవా తత్వంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. హనుమాన్ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు నెలకొనాలని ఆంజనేయస్వామిని ప్రార్థించినట్లు తెలిపారు

# ఓటు జాబితాపై బీఆర్ఎస్ ఫోకస్



కుత్బుల్లాపూర్, మే 12 ( హంసకలం వార్త )

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 129వ సూరారం డివిజన్ టీఎస్ఐఐసీ కాలనీలోని బహుళ ప్రయోజన కమ్యూనిటీ భవన్‌లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై నిర్వహించిన అవగాహన సదస్సుకు బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డివిజన్ నాయకులు, బూత్ స్థాయి ప్రతినిధులకు ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, పాటించాల్సిన నియమాలు, జాగ్రత్తలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఓటు విలువను గుర్తించిన పౌరుడే ప్రజాస్వామ్యానికి నిజమైన రక్షకుడు అని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో నకిలీ ఓట్లు, శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వెళ్లిపోయిన వారి ఓట్లు, అసలు వ్యక్తులు లేని పేర్లతో నమోదైన ఓట్లను గుర్తించి తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. కుటుంబ సభ్యుల ఓట్లను సరైన విధంగా మ్యాపింగ్ చేయడంతో పాటు కొత్త ఓటర్ల నమోదుకు నాయకులు, బూత్ స్థాయి ప్రతినిధులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు, యువత, వృద్ధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఓటరు జాబితాలో ఎలాంటి తప్పిదాలు చోటుచేసుకోకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. అలాగే రానున్న రోజుల్లో కేసీఆర్ నాయకత్వంలో చేపట్టనున్న సభ్యత్వ నమోదు కార్యక్రమం, కొత్త కమిటీల ఏర్పాటు, పార్టీ బలోపేతం కోసం ప్రజల్లోకి మరింత విస్తృతంగా వెళ్లే కార్యాచరణపై కూడా నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్, సీనియర్ నాయకులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు, మహిళా నాయకులు, అనుబంధ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు..

# అల్లాపూర్‌లో ఆధ్యాత్మిక వేడుకల జోష్



అల్లాపూర్, మే 12 ( హంసకలం వార్త )

అల్లాపూర్ డివిజన్ వివేకానంద నగర్‌లోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమాన్ జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. దేవస్థానం కమిటీ ఆహ్వానం మేరకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జనసేన కోఆర్డినేటర్ ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నప్రసాద వితరణలో పాల్గొని భక్తులకు సేవలందించారు. ఈ సందర్భంగా దేవస్థానం కమిటీ సభ్యులు ప్రేమ్ కుమార్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కొల్లా శంకర్, వేముల మహేష్, బండారు ప్రసన్నాంజనేయులు, తుంగం శ్రీనివాస్ రావు, బొల్లి శ్రీనివాస్ రావు, పవన్, తుంగ రామారావు, జల్ల రవి, ఆర్ జగన్నాథం, మధు, దేవస్థానం కమిటీ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు

# భక్తులతో కిటకిటలాడిన ఆంజనేయ ఆలయం




కూకట్ పల్లి, మే 12 ( హంసకలం వార్త )

హనుమాన్ జయంతి సందర్భంగా కూకట్ పల్లి బగ్ అమీర్ బాల ఆంజనేయ స్వామి దేవాలయంలో భక్తి శ్రద్ధల నడుమ ఘనంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. స్వామివారికి అభిషేకాలు, అలంకరణలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేక హారతులు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధనలో వందలాది మంది భక్తులు పాల్గొని ప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆకుల లక్ష్మణరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రమణ పంతులు బృందం, కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు చురుకుగా పాల్గొన్నారు. భక్తుల సహకారంతో వేడుకలు విజయవంతంగా సాగాయని నిర్వాహకులు తెలిపారు. హనుమాన్ జయంతి వేడుకలతో బగ్ అమీర్ ప్రాంతం మొత్తం భక్తి పారవశ్యంలో మునిగిపోయింది

# జీడిమెట్లలో ఆంజనేయ భక్తి వెల్లువ

-జీడిమెట్లలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు..
-ఆలయాల్లో భక్తులతో కిటకిటలాడిన పూజా కార్యక్రమాలు..
-వేడుకల్లో పాల్గొన్న భరత్ సింహ రెడ్డి..
-అన్నదానం, భజనలతో ఆధ్యాత్మిక సందడి..

కుత్బుల్లాపూర్, మే 12 ( హంసకలం వార్త )



కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 132 జీడిమెట్ల డివిజన్ పరిధిలో హనుమాన్ జయంతి వేడుకలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కుత్బుల్లాపూర్ గ్రామంలోని వేణుగోపాల స్వామి ఆలయం, ఎం.ఎన్.రెడ్డి నగర్ హనుమాన్ ఆలయం, వెంకటేశ్వర కాలనీ పశ్చిమ ప్రాంతంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, హోమాలు, భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి వేడుకలకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులతో కలిసి హారతులు ఇచ్చి ఆంజనేయ స్వామి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆయనకు సాదర స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. చిన్నారులు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని భక్తి గీతాలు ఆలపించారు. ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలు కూడా నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనాలని ఆకాంక్షించారు. హనుమాన్ స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు, భక్తులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు..

# అల్లాపూర్‌లో హనుమాన్ శోభాయాత్ర హోరు





అల్లాపూర్, మే 12 ( హంసకలం వార్త )

అల్లాపూర్ డివిజన్ పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్ ప్రాంతం ఆదివారం ఆధ్యాత్మిక శోభతో తళుకులీనింది.. హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ముఖ్యంగా ఆంజనేయ స్వామివారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, విశేష అలంకరణలు ఘనంగా నిర్వహించబడాయి. ఉదయం పూజలు అనంతరం ప్రసాద్ నాయుడు ఆధ్వర్యంలో భారీ హనుమాన్ శోభాయాత్రను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై శోభాయాత్రను ప్రారంభించారు. శోభాయాత్రలో హిందూ యువకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని భక్తి గీతాల నడుమ నృత్యాలతో ఉత్సాహాన్ని ప్రదర్శించారు. జై శ్రీరామ్..జై హనుమాన్..నినాదాలతో పురవీధులు మార్మోగాయి. మొత్తం ప్రాంతం భక్తి ఉత్సాహంతో ఉప్పొంగిపోయింది. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్ గౌడ్, రేష్మ, బర్కత్ అలీ, నరసింహ, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు..

# పోక్సో కేసు కప్పిపుచ్చే యత్నాలపై బీఆర్ఎస్ ఫైర్

-పోక్సో కేసులో కీలక సెక్షన్లు తొలగింపుపై తీవ్ర ఆరోపణలు..
- మైనర్ బాలికకు న్యాయం కోరుతూ ఎన్‌హెచ్--65పై రోడ్డుబ్లాక్ ఆందోళన..
-కాంగ్రెస్--బీజేపీ వైఖరిపై బీఆర్ఎస్ నేతల తీవ్ర విమర్శలు..
-దోషులపై కఠిన చర్యలు కోరుతూ భారీ నిరసన వెల్లువ

శేరిలింగంపల్లి, మే 12 ( హంసకలం వార్త )

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో కీలక సెక్షన్లు 7, 8లను తొలగించి కేసును నీరుగార్చే ప్రయత్నం జరిగిందని ఆరోపిస్తూ, సెక్షన్లు 11, 12 మాత్రమే నమోదు చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. బాధిత మైనర్ బాలికకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ చందానగర్ డివిజన్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఎన్‌హెచ్--65పై శేరిలింగంపల్లి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రహదారిని దిగ్బంధించి ఆందోళనకు దిగడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బాధిత బాలికకు వెంటనే న్యాయం చేయాలి దోషులను తక్షణమే అరెస్ట్ చేయాలి కాంగ్రెస్, బీజేపీ రాజకీయ నాటకాలు ఆపాలి" అంటూ నిరసనకారులు తీవ్ర నినాదాలు చేశారు. రాష్ట్రంలో మహిళల భద్రత ప్రమాదంలో పడిందని ఆరోపించిన నాయకులు, దోషులపై కఠిన చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల భద్రతను కాపాడాల్సిన ప్రభుత్వాలు రాజకీయ ప్రయోజనాల కోసం మౌనం వహించడం దారుణమని మండిపడ్డారు. ఈ ఘటనపై కాంగ్రెస్ ప్రభుత్వం, బీజేపీ నాయకత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేస్తూ,



న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బొబ్బ నవత రెడ్డి, పొట్ట నరేందర్ యాదవ్, రోజా, మమత, నాగమణి, వాలా హరీష్, మిద్దెల మల్లారెడ్డి, తిరుమలేష్, కె. రాములు, బీఎస్ఎన్ కిరణ్ యాదవ్, సంతోష్ రెడ్డి, రామకృష్ణ గౌడ్, శివరాజ్, శ్రీనివాస్, శ్రీకాంత్, ప్రకాష్, రాజు, వాకిటి శంకర్, నవీన్ యాదవ్, ప్రమోద్, ఘౌస్, బాబు మల్లేష్, సుభాష్ రాథోడ్, బీఆర్ఎస్వీ రాజు, షరీన్, రాజు, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు..

# నీట్ లీక్‌పై కూకట్‌పల్లిలో ఏబీవీపీ ఆగ్రహ జ్వాల

-నీట్ యూజీ 2026 లీక్‌పై కూకట్‌పల్లిలో ఏబీవీపీ భారీ నిరసన
-పరీక్షా అవకతవకలపై విద్యార్థి సంఘాల ఆగ్రహం వెల్లువ..
- సీబీఐ దర్యాప్తును స్వాగతించిన ఏబీవీపీ, దోషులకు కఠిన శిక్ష డిమాండ్..
-ఎన్‌టీఏపై తీవ్ర విమర్శలు, డైరెక్టర్ జనరల్ రాజీనామా కోరింపు..

కూకట్‌పల్లి, మే 12 ( హంసకలం వార్త )



నీట్ యూజీ 2026 పరీక్షలో ప్రశ్నాపత్రాల లీక్, అవకతవకలపై అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కూకట్‌పల్లి విభాగం, జిల్లా ఆధ్వర్యంలో తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ దిష్టిబొమ్మ దహనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విద్యార్థి కార్యకర్తలు పాల్గొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్న ఇలాంటి ఘటనలను తీవ్రంగా ఖండించిన నాయకులు, ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ కూకట్‌పల్లి విభాగ్ కన్వీనర్ నాగేశ్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు కష్టపడి సిద్ధమవుతున్న సమయంలో ప్రశ్నాపత్రాల లీక్ జరగడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. విద్యా వ్యవస్థలో పెరుగుతున్న అవినీతి, పరీక్షా మాఫియాలను పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. నీట్ యూజీ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తును కేంద్ర ప్రభుత్వం ఆమోదించడం స్వాగతార్హమని పేర్కొంటూ, దర్యాప్తులో అన్ని దోషులను గుర్తించి కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ విడిచిపెట్టరాదని హెచ్చరించారు. అలాగే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పనితీరుపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, వరుసగా జరుగుతున్న అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ సంస్థ డైరెక్టర్ జనరల్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో పారదర్శకమైన, నమ్మకమైన పరీక్షా వ్యవస్థ అవసరమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి జిల్లా కన్వీనర్ పడమటి భరత్, మేడ్చల్ జిల్లా కన్వీనర్ మృత్యుంజయ, రాష్ట్ర కో కన్వీనర్ గోపాల్, యూనివర్సిటీ కో కన్వీనర్ దుర్గాప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాఘవేంద్ర, కేపీహెచ్‌బీ టౌన్ కార్యదర్శి ఆకాశ్‌తో పాటు అవినాష్, నిహాల్, చరణ్, నవీన్, ఆదిత్య, హర్షిత్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు..

# తీర్మాన ప్రతి సమర్పించడంలో ఆలస్యం

-సర్పంచ్ కు షో కాజ్ నోటీసు జారీ
-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

( హంసకలం వార్త )

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి సంబంధించిన గ్రామపంచాయతీ తీర్మానం ప్రతిని సమర్పించడంలో జాప్యంపై చెన్నూర్ మండలం సోమనపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ తోకల మల్లేష్ కు షో కాజ్ నోటీసు జారీ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలలో నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ప్రాజెక్టుకు ప్రాధాన్యతనిచ్చి,మంచిర్యాల జిల్లాలోని చెన్నూరు మండలం సోమన్‌పల్లి గ్రామపంచాయతీలో మంజూరు చేసి పాఠశాల నిర్మాణానికి తగినంత నిధులను విడుదల చేస్తుందని తెలిపారు. పాఠశాల నిర్మాణానికి అవసరమైన గ్రామ పంచాయతీ తీర్మానం ప్రతిని సమర్పించడంలో విపరీతమైన జాప్యం జరుగుతున్నట్లు గమనించడం జరిగిందని,ఈ విషయమై సరైన వివరణ కోరుతూ నోటీసు జారీ చేయడం జరిగిందని,సకాలంలో వివరణ అందించని పక్షంలో తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018లోని సెక్షన్ 37(5) చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.



# ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులో ఇద్దరు నిందితులకు జైలు శిక్ష

-ప్రత్యేక కోర్టు కీలక తీర్పు
-ఆధారాలు సమర్పించిన పోలీసు అధికారులు
-అభినందించిన ఎస్పీ శరత్ చంద్ర పవార్

( హంసకలం వార్త )

నల్లగొండ జిల్లా డిండి పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులో ఇద్దరు నిందితులకు జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ నల్లగొండ ఎస్సీ,ఎస్టీ ప్రత్యేక సెషన్స్ కోర్టు తీర్పు వెలువరించినట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ తెలిపారు. కేసు వివరాల ప్రకారం... చందంపేట మండలం గన్నెర్లపల్లి గ్రామానికి చెందిన నక్క పర్వతాలు (యాదవ్) డిండి మండలానికి చెందిన ఎస్సీ కులానికి చెందిన యువతితో పరిచయం పెంచుకొని పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా వాడుకున్నాడు.అనంతరం యువతి పెళ్లి విషయమై ప్రశ్నించగా,నక్క పర్వతాలు తన అత్త నీలం సత్తమ్మతో కలిసి కులాన్ని దూషిస్తూ వివాహానికి నిరాకరించినట్లు బాధితురాలు ఫిర్యాదు చేసింది.ఈ మేరకు డిండి పోలీస్ స్టేషన్‌లో ఐపీసీ సెక్షన్లు 417,420,323, 506 రెడ్‌విత్ 109తో పాటు ఎస్సీ,ఎస్టీ (అత్యాచార నిరోధక) చట్టంలోని సెక్షన్ 3(1)(ఇ) కింద కేసు నమోదు చేశారు.విచారణ అనంతరం ప్రత్యేక కోర్టు నిందితులు నక్క పర్వతాలు (ఏ1),నీలం సత్తమ్మ (ఏ2)లకు ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టంలోని సెక్షన్ 3(1)(ఇ) కింద ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.1,000 జరిమానా విధించింది.జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా రెండు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆదేశించింది.అదేవిధంగా ప్రధాన నిందితుడు నక్క పర్వతాలకు ఐపీసీ సెక్షన్ 417 కింద ఒక సంవత్సరం సాధారణ జైలు శిక్ష, రూ.1,000 జరిమానా విధించగా,సెక్షన్ 420 కింద మరో ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.1,000 జరిమానా విధించింది.ఐపీసీ సెక్షన్ 323 కింద ఒక్కొక్కరికి రూ.1,000 చొప్పున జరిమానా,సెక్షన్ 506 కింద మరో రూ.1,000 జరిమానా విధిస్తూ, చెల్లించని పక్షంలో రెండు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని కోర్టు ఆదేశించింది.కోర్టు ఆదేశాల మేరకు అన్ని శిక్షలు ఏకకాలంలో అమలులో ఉండనున్నాయి.దీంతో ప్రధాన నిందితుడు నక్క పర్వతాలకు మొత్తం 11 సంవత్సరాల వివిధ శిక్షలు,రూ.5,000 జరిమానా విధించగా, నీలం సత్తమ్మకు ఐదేళ్ల జైలు శిక్ష,రూ.3,000 జరిమానా విధించారు.ఈ కేసులో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి.నరసింహ వాదనలు వినిపించగా, కేసు నమోదు సమయంలో డిండి ఎస్సైగా పనిచేసిన ఎం.రామాంజనేయులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.దేవరకొండ ఎస్‌డీపీఓ కె.మనోహర్ దర్యాప్తు నిర్వహించారు. ప్రస్తుతం డిండి ఎస్‌హెచ్‌వోగా బాలకృష్ణ, సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కె. బీసన్న,దేవరకొండ ఎస్‌డీపీఓగా ఎం.వి.శ్రీనివాస్ విధులు నిర్వహిస్తున్నారు.కోర్టు విధుల్లో భాగంగా హెడ్ కానిస్టేబుల్ కె.కృష్ణన్, కానిస్టేబుల్ పి. లింగయ్యలు డ్యూటీ అధికారులుగా వ్యవహరించారు.ఈ కేసులో సరైన ఆధారాలు సమర్పించి నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ అభినందించారు.

# గంజాయి నిర్మూలనపై బెల్లంపల్లి వన్‌టౌన్ పోలీసుల ప్రత్యేక చర్యలు

-నార్కోటిక్ పరీక్షల్లో పాజిటివ్‌గా తేలిన నలుగురిపై కేసులు నమోదు
-డి-అడిక్షన్ సెంటర్‌కు తరలింపు

( హంసకలం వార్త )




బెల్లంపల్లి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి రవాణా, నిల్వ,సరఫరా నిర్మూలనతో పాటు నేరాల నియంత్రణకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.ఇందులో భాగంగా గతంలో గంజాయి రవాణా కేసుల్లో నిందితులుగా ఉన్న ఆరుగురు వ్యక్తులను బెల్లంపల్లి వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు.అనంతరం నార్కోటిక్ పరీక్షల నిమిత్తం వారిని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, యూరిన్ టెస్ట్ ద్వారా పరీక్షలు నిర్వహించారు. అందులో నలుగురు వ్యక్తులు పాజిటివ్‌గా తేలినట్లు గుర్తించారు.బెల్లంపల్లి బస్తీకి చెందిన చేపల వ్యాపారి ఎస్‌కే జమీర్(26) తండ్రి మహబూబ్,వెజిటేబుల్ మార్కెట్ ప్రాంతానికి చెందిన రోజువారీ కూలీ ఆర్.ఎమ్‌డీ తాజ్ బాబా(20) తండ్రి ఎస్‌కే కలీం,వెజిటేబుల్ మార్కెట్ ప్రాంతానికి చెందిన కూరగాయల వ్యాపారి,ఎస్‌కే కలీం(30) తండ్రి ఎస్‌కే మహబూబ్,65 డిప్ ప్రాంతానికి చెందిన డ్రైవర్ తోట మనీదీప్ (21) తండ్రి శేఖర్ లను పోలీస్ స్టేషన్‌కు తరలించి చట్టపరమైన కేసులు నమోదు చేశారు. అనంతరం నిందితులను న్యాయస్థానం ముందు హాజరుపరచగా,కోర్టు ఆదేశాల మేరకు వారిని 15 రోజుల పాటు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలోని డి-అడిక్షన్ సెంటర్‌కు తరలించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా బెల్లంపల్లి వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ... మత్తు పదార్థాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని పేర్కొన్నారు.మత్తు పదార్థాలకు బానిసైన వారిని చెడు అలవాట్ల నుంచి దూరంగా ఉంచేందుకు ప్రత్యేక కౌన్సిలింగ్, వైద్య పరీక్షలు,అవసరమైన చికిత్స అందిస్తున్నామని తెలిపారు.గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల రవాణా, నిల్వ, వినియోగం వంటి అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు.

# మదర్ డెయిరీ అభివృద్ధికి కీలక ఒప్పందం

-పాడి రైతుల సంక్షేమానికి రూ.10 కోట్ల ప్రోత్సాహం
-ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కృషితో ముందడుగు

( హంసకలం వార్త )




తెలంగాణలో పాడి పరిశ్రమ అభివృద్ధి మరియు పాడి రైతుల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని నేషనల్ డెయిరీ డెవలప్మెంట్ బోర్డు (ఎన్డీడీఆర్) మరియు మదర్ డెయిరీ సంస్థ మధ్య కీలక ఒప్పందం కుదిరింది. హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో జరిగిన సమావేశంలో తెలంగాణ రాష్ట్ర మంత్రి వాకిటీ శ్రీహరి,రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సమక్షంలో పరస్పర సహకార ఒప్పందంపై ఇరు సంస్థల ప్రతినిధులు సంతకాలు చేశారు. ఈ సమావేశంలో పశుసంవర్ధక శాఖ కార్యదర్శి ఇలాంబర్తి, మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి,సంస్థ డైరెక్టర్లు,ఎన్డీడీఆర్ సీనియర్ జనరల్ మేనేజర్ డాక్టర్ శ్రీధర్, సౌత్ రీజినల్ హెడ్ ఆర్మీ జకబ్, డిప్యూటీ జనరల్ మేనేజర్ మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎన్డీడీఆర్ అధికారులు మదర్ డెయిరీ అభివృద్ధి కోసం రూ.10 కోట్ల చెక్కును మంత్రి వాకిటీ శ్రీహరి మరియు విప్ బీర్ల ఐలయ్య చేతుల మీదుగా మదర్ డెయిరీ ప్రతినిధులకు అందజేశారు.ఈ నిధులను పాల సేకరణ కేంద్రాల విస్తరణ, శీతలీకరణ కేంద్రాల ఆధునీకరణ,రైతులకు సాంకేతిక సదుపాయాల కల్పన,పాడి పరిశ్రమ విస్తరణతో పాటు పెండింగ్ బిల్లుల చెల్లింపుల కోసం వినియోగించనున్నట్లు తెలిపారు.ఈ ఒప్పందం ద్వారా పాడి రైతులకు ఆర్థికంగా మరింత లాభం చేకూరడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని అధికారులు పేర్కొన్నారు.పాల ఉత్పత్తి రంగాన్ని బలోపేతం చేయడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వెల్లడించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ... తెలంగాణలో పాడి పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.రైతులు ఆర్థికంగా బలపడాలంటే పాల ఉత్పత్తి రంగాన్ని ఆధునికీకరించడం అవసరమని పేర్కొన్నారు. ఎన్డీడీఆర్-మదర్ డెయిరీ?ఒప్పందం రైతులకు ఎంతో మేలు చేస్తుందని,రైతులకు సమయానికి బిల్లులు చెల్లించడం,పాల సేకరణను పెంచడం,ఆధునిక సదుపాయాలు కల్పించడం ద్వారా పాడి రంగాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరిగి యువతకు కూడా ప్రయోజనం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# త్వరలో ఏఎన్ఎం పోస్టులను భర్తీ చేస్తాం: మంత్రి దామోదర

( హంసకలం వార్త )

త్వరలో ఏఎన్ఎం పోస్టులను భర్తీ చేస్తామని మంత్రి దామోదర నర్సింగ్ అన్నారు. ఆఫీసర్స్‌గా ఎంపికైన వారికి మంగళవారం మంత్రి దామోదర రాజనర్సింహ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. ..త్వరలో ఏఎన్ఎం పోస్టులకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేయబోతున్నట్లు తెలిపారు.'16 నూతన నర్సింగ్ కాలేజీలను ప్రారం భించామన్నారు. రాష్ట్రంలో మొత్తం 1.85 లక్షల మంది నర్సింగ్ ఆఫీసర్స్ ఉన్నారు. త్వరలో టిమ్స్ ఆస్పత్రి ప్రారంభోత్సవం చేస్తాం' అని చెప్పారు.



## జూబ్లీహిల్స్‌లో ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు రంగం సిద్ధం



జూబ్లీహిల్స్, మే 12 ( హంసకలం వార్త )

జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని సారథి స్టూడియో కూడలి వద్ద స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహ ఏర్పాటు స్థలాన్ని తెలంగాణ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరిశీలించారు. కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి నవీన్ యాదవ్, కాంగ్రెస్ నాయకుడు చిన్న శ్రీశైలం యాదవ్, స్థానిక కాంగ్రెస్ నాయకులు, ఎన్టీఆర్ అభిమానులతో కలిసి స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్టీఆర్ విగ్రహాన్ని అత్యంత త్వరలో ప్రభుత్వ లాంఛనాలతో ఘనంగా ఆవిష్కరిస్తామని తెలిపారు. తెలుగు ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ చిరస్థాయిగా నిలిచిపోయే మహానేత అని కొనియాడారు. అనంతరం ఎమ్మెల్యే వి నవీన్ యాదవ్ వివాహ వార్షికోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి నవీన్ యాదవ్, వర్ష యాదవ్ దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి గాలి బాలాజీ, గంధం రాజు, జీవీఆర్, అరవింద్ రెడ్డి, సాయిబాబా చౌదరి, గోపాల్ చౌదరి, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, ఎన్టీఆర్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

శేర్లింగంపల్లి, మే 12 ( హంసకలం వార్త )



శేర్లింగంపల్లి పరిధిలో హనుమాన్ జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. హనుమంతుడు శ్రీరాముడి సేవనే జీవిత పరమార్థంగా భావించి నిస్వార్థ భక్తితో ధర్మ పరిరక్షణకు అంకితమై నిలిచిన మహోన్నత వ్యక్తిత్వమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ వి.గౌడ్ పేర్కొన్నారు. భక్తి, విధేయత, ధైర్యసాహసాలకు ప్రతీకగా హనుమంతుడు ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా మాతృశ్రీనగర్ డివిజన్ పరిధిలోని సుభాష్ చంద్రబోస్ నగర్ హనుమాన్ ఆలయం, ఇజ్జత్‌నగర్ డివిజన్ పరిధిలోని హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, హారతులు ఘనంగా నిర్వహించారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించగా భక్తులతో ఆలయ ప్రాంగణాలు కిక్కిరిశాయి. మహిళలు, యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వి.గౌడ్ మాట్లాడుతూ ప్రజలు ధర్మం, సేవాభావం, నిజాయితీ మార్గంలో నడవాలని హనుమంతుడు ఇచ్చిన సందేశం నేటికీ సమాజానికి మార్గదర్శకమని తెలిపారు. భక్తులందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రతి ఇంటా సుఖశాంతులు నెలకొనాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, భక్తులు, కాలనీవాసులు పాల్గొన్నారు..

## ప్రవేట్ పాఠశాలలు కొత్త దోపిడీ

-బెస్ట్ అవైలబుల్ పేరుతో పేదల జేబుల కోత..
-ఫీజుల కోసం ప్రైవేట్ స్కూళ్ల కొత్త డ్రామా..
-ప్రభుత్వ నిధుల పేరుతో తల్లిదండ్రులపై ఒత్తిడి..
-విద్యాశాఖ వెంటనే చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్..
-చర్యలు తీసుకోకపోతే ఆందోళన హెచ్చరిక..

సంగారెడ్డి, మే 12 ( హంసకలం వార్త )



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న బెస్ట్ అవైలబుల్ పాఠశాల పథకాన్ని కొందరు ప్రైవేట్ విద్యాసంస్థలు అపహాస్యం చేస్తున్నాయి. ప్రభుత్వమే ఫీజులు భరిస్తుందనే నమ్మకంతో పిల్లలను కార్పొరేట్ పాఠశాలల్లో చేర్పించిన పేద కుటుంబాలపై ఇప్పుడు ఫీజుల భారం మోపేందుకు యాజమాన్యాలు ఒత్తిడి తెస్తున్నాయి. సంగారెడ్డిలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలలు పథకం కింద చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి ఫీజులు చెల్లించాలని హెచ్చరిస్తున్నాయి. గత మూడు సంవత్సరాలుగా ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాలేదని, ముందుగా తల్లిదండ్రులే ఫీజులు చెల్లించాలని, తర్వాత ప్రభుత్వం డబ్బులు విడుదల చేసిన వెంటనే తిరిగి ఇస్తామని చెబుతూ ఒత్తిడి చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై స్పందించిన డీజేఎఫ్ ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు రాపాక విజయరాజు, పేదలపై విద్యాసంస్థలు వేధింపులు ఆపాలని హెచ్చరించారు. ప్రభుత్వం ఫీజులు వసూలు చేయాలని ఎలాంటి ఉత్తర్వులు జారీ చేసిందని ప్రశ్నించిన ఆయన, అధికారిక ఆదేశాలు లేకుండా తల్లిదండ్రులను ఇబ్బంది పెట్టడం అన్యాయమని మండిపడ్డారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇప్పటికే విద్యాసంస్థల ప్రతినిధులతో మాట్లాడి నిధుల విడుదలకు హామీ ఇచ్చిన నేపథ్యంలో, మధ్యలో పేద కుటుంబాలను వేధించడం సరికాదని స్పష్టం చేశారు. ఫీజుల ఒత్తిడితో భయాందోళనకు గురైన బాధిత తల్లిదండ్రులు సోమవారం జిల్లా సంయుక్త కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆర్థిక ఇబ్బందుల వల్లే ప్రభుత్వ పథకం కింద పిల్లలను చేర్పించాం. ఇప్పుడు వేల రూపాయలు ఫీజులు కట్టమంటే ఎక్కడి నుంచి తెచ్చుకోవాలి అంటూ తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. పేద విద్యార్థుల చదువును వ్యాపారంగా మార్చొద్దని, ఇటువంటి విద్యాసంస్థలపై విద్యాశాఖ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని రాపాక విజయరాజు డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చే వరకు అదనంగా ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదని బాధితులకు భరోసా ఇచ్చారు. జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు..

# బిజినెస్

## దేశంలో ఇంధన కొరత లేదు..
## కానీ రోజుకు రూ. 1000 కోట్ల నష్టం

( హంసకలం వార్త ) మే 12




పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ పొదుపు పాటించాలంటూ ప్రజలకు పిలుపునిచ్చిన మరుసటి రోజే కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. దేశంలో పెట్రోలియం ఉత్పత్తులకు ఎలాంటి కొరతా లేదని స్పష్టం చేసింది. అయితే, అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరిగినా, ఆ భారాన్ని ప్రజలపై మోపకుండా ప్రభుత్వ రంగ చమురు సంస్థలు రోజుకు దాదాపు రూ.1,000 కోట్ల నష్టాలను భరిస్తున్నాయని వెల్లడించింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సోమవారం జరిగిన మంత్రుల కమిటీ సమావేశంలో ఈ విషయాలు వెల్లడించారు. దేశంలో 60 రోజులకు సరిపడా ముడిచమురు, 45 రోజులకు సరిపడా ఎల్పీజీ నిల్వలు ఉన్నాయని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం తెలిపింది. 703 బిలియన్ డాలర్ల విదేశీ మారక నిల్వలు కూడా ఆశాజనకంగా ఉన్నాయని పేర్కొంది. అయితే, అంతర్జాతీయ ధరల వల్ల దేశంపై భారీ భారం పడుతోందని, ఇంధన పొదుపు ద్వారా ఈ భారాన్ని తగ్గించవచ్చని ప్రభుత్వం పేర్కొంది. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే వస్తువుల వాడకాన్ని తగ్గించాలని, అనవసరమైన విదేశీ మారక వ్యయాన్ని నివారించాలని ప్రధాని మోదీ తన విజ్ఞప్తిని పునరుద్ఘాటించారు. ప్రధాని పిలుపుపై విపక్షాలు తీవ్రంగా స్పందించాయి. ఇది మోదీ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. ఇంధన ధరల పెంపునకు రంగం సిద్ధం చేస్తున్నారని జైరాం రమేశ్ ఆరోపించారు. ఎన్నికల తర్వాతే ఈ సంక్షోభం ఎందుకు గుర్తుకొచ్చిందని అఖిలేశ్ యాదవ్ ప్రశ్నించగా, మంగళసూత్రాల గురించి మాట్లాడిన మోదీయే ఇప్పుడు బంగారం కొనవద్దని చెప్పడం విడ్డూరంగా ఉందని తేజస్వి యాదవ్ ఎద్దేవా చేశారు. ప్రధాని పిలుపు ప్రభావంతో సోమవారం స్టాక్ మార్కెట్లు భారీగా పతనమయ్యాయి. రూపాయి విలువ ఆల్-టైమ్ కనిష్టానికి చేరింది. ఈ విమర్శలపై స్పందించిన బీజేపీ, ఇది దేశ ప్రయోజనాల కోసం తీసుకున్న నిర్ణయమని, గతంలో నెహ్రూ కూడా ఇలాంటి పిలుపు ఇచ్చారని గుర్తు చేసింది.

## రెండో రోజూ కుప్పకూలిన మార్కెట్లు

- పశ్చిమాసియా ఉద్రిక్తతలు, క్రూడ్ ఆయిల్ ధరల పెరుగుదలతో అమ్మకాల ఒత్తిడి
- 1,456 పాయింట్లు పతనమైన సెన్సెక్స్, 436 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ
- ప్రధాని మోదీ వ్యాఖ్యలతో ఇన్వెస్టర్లలో పెరిగిన ఆందోళన
- ఐటీ, రియల్టీ షేర్లలో భారీ అమ్మకాలు


( హంసకలం వార్త ) మే 12



భారత స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ నష్టాలను చవిచూశాయి. వరుసగా రెండో సెషన్‌లో కూడా అమ్మకాల సునామీ కొనసాగింది.పశ్చిమాసియాలో పెరుగు తున్న ఉద్రిక్తతలు, అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు భగ్గుమనడం తో ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గుచూపారు. ఫలితంగా అన్ని రంగాల షేర్లలోనూ తీవ్రమైన అమ్మకాల ఒత్తిడి కనిపించింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 1,456.04 పాయింట్లు పతనమై 74,559.24 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 436.3 పాయింట్లు నష్టపోయి 23,379.55 వద్ద ముగిసింది. పెరుగుతున్న భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో ఇంధన వినియోగం, విదేశీ ప్రయాణాలు, బంగారం కొనుగోళ్లు తగ్గించుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు పిలుపుని వ్వడం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను మరింత బలహీనపరిచింది. ఈ వ్యాఖ్యలతో పశ్చిమాసియా సంక్షోభం భారత ఆర్థిక వ్యవస్థపై విస్తృత ప్రభావం చూపుతుందనే భయాలు తీవ్రమయ్యాయి. బ్రాడర్ మార్కెట్‌లో నష్టాలు మరింత ఎక్కువగా ఉన్నాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 2.54 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 3.17 శాతం మేర పతనమయ్యాయి. రంగాల వారీగా చూస్తే ఐటీ, రియల్టీ షేర్లు అత్యధికంగా నష్టపోయాయి. టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్, టైటాన్, టీసీఎస్ వంటి షేర్లు 4.44 శాతం వరకు నష్టపోయాయి. సెన్సెక్స్ 30 షేర్లలో ఎస్‌బీఐ మాత్రమే లాభాల్లో ముగియడం గమనార్హం. సాంకేతిక విశ్లేషకుల ప్రకారం, నిఫ్టీకి తక్షణ మద్దతు 23,300 వద్ద, ఆ తర్వాత 23,100 వద్ద ఉందని చెబుతున్నారు. ఎగువ స్థాయిలో 23,500 తక్షణ నిరోధకంగా మారింది. క్రూడ్ ఆయిల్ ధరలు, భౌగోళిక రాజకీయ అనిశ్చితుల కారణంగా సమీప భవిష్యత్తులో మార్కెట్లలో ఒడిదుడుకులు కొనసాగవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే, పటిష్ఠమైన దేశీయ ఆర్థిక మూలాలు మార్కెట్లకు మద్దతుగా నిలుస్తాయని వారు అభిప్రాయ పడుతున్నారు.

## సీనియర్ సిటిజన్ హెల్త్ ఇన్సూరెన్స్.. తప్పక తెలుసుకోవాల్సిన విషయాలు..

( హంసకలం వార్త ) మే 12



సీనియర్ సిటిజన్ హెల్త్ ఇన్సూరెన్స్ అనేది ప్రత్యేకంగా 60 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్నవారి కోసం రూపొందించినది మెడికల్ హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమ్. వయస్సు పెరుగుతున్న కొద్దీ అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశాలు ఎక్కువవుతాయి. అలాగే వైద్య ఖర్చులు కూడా భారీగా పెరుగుతాయి. ఈ పరిస్థితుల్లో సరైన హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ వైద్య ఖర్చులను తగ్గించడంలో సహాయపడుతుంది. అలాగే అవసరమైన చికిత్సను పొందేందుకు ఆర్థిక భరోసాను అందిస్తుంది. సీనియర్ సిటిజన్ల కోసం తీసుకునే మెడికల్ ఇన్సూరెన్స్ పాలసీ.. కేవలం ఆర్థిక ఉత్పత్తి మాత్రమే కాదు, ఆరోగ్య సమస్యల సమయంలో కుటుంబం ఏళ్లుగా కూడబెట్టుకున్న సేవింగ్స్ కాపాడే భరోసా కూడా. పాలసీ ఎంపిక సమయంలో బ్రోచర్‌లో ఉన్న వివరాలకే పరిమితం కాకుండా పాలసీ నిబంధనలను పూర్తిగా చదవడం చాలా ముఖ్యం. ఎందుకంటే క్లెయిమ్ సమయంలో ఉపయోగపడే అసలు విషయాలు అందులోనే ఉంటాయి. ఉదాహరణకు: కో-పేమెంట్ క్లాజ్ ఉందా? రూమ్ రెంట్ పరిమితి ఎంత? మోకాలి మార్పిడి, గుండె శస్త్రచికిత్సల వంటి ఖరీదైన చికిత్సలకు ప్రత్యేక పరిమితులు ఉన్నాయా? లేవా? అనేది చెక్ చేసుకోవాలి. అలాగే రోజుకు రూ.3,000 రూమ్ రెంట్ పరిమితి ఉన్న పాలసీ తీసుకున్నారు.. కానీ ఆసుపత్రి రూమ్ రెంట్ రూ.7,000 అయితే, డాక్టర్ ఫీజు, నర్సింగ్, అనస్తీషియా వంటి ఇతర ఖర్చులు కూడా అనుపాతంగా తగ్గించబడతాయి. అందుకే 60 ఏళ్లు దాటిన తల్లిదండ్రుల కోసం పాలసీ తీసుకునే ముందు వాస్తవ చికిత్స పరిస్థితిని ఊహించి పాలసీ నిబంధనల ప్రకారం ఎంత కవరేజ్ వస్తుందో పరిశీలించడం మంచిది.

## ఆ సెంచరీ తర్వాత నాకంటే అతడే అర్హుడు అనిపించింది: సంజూ శాంసన్

- భారత జట్టులో స్థానం కోసం ఉన్న పోటీపై సంజూ శాంసన్ ఆసక్తికర వ్యాఖ్యలు
- తన స్థానం కోసం ఇషాన్ కిషన్ వస్తున్నాడని ముందే గ్రహించానన్న సంజూ
- తిరువనంతపురంలో ఇషాన్ సెంచరీ తర్వాత తనకంటే అతడే జట్టులో కరెక్ట్ అనుకున్నానని వెల్లడి
- గత రెండేళ్లుగా జట్టుకు దూరమైన ఇషాన్, కష్టపడి తిరిగి జట్టులోకి వచ్చాడని ప్రశంస

( హంసకలం వార్త ) మే 12




భారత క్రికెట్ జట్టులో చోటు దక్కించుకోవడం ఎంత కష్టమో, దాన్ని నిలబెట్టుకోవడం అంతకంటే కష్టమని అంటుంటారు. ముఖ్యంగా టీ20 ఫార్మాట్‌లో పోటీ తీవ్రస్థాయిలో ఉంది. ఈ పోటీపై టీమిండియా వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ తాజాగా కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తన సహచరుడు ఇషాన్ కిషన్ నుంచి ఎదురైన పోటీ గురించి మనసు విప్పి మాట్లాడాడు. దేశవాళీ క్రికెట్‌లో అద్భుతంగా రాణించి జట్టులోకి తిరిగి వచ్చిన ఇషాన్ కిషన్, తన స్థానం కోసం వస్తున్నాడని తాను ముందే గ్రహించానని సంజూ అంగీకరించాడు. ఇటీవల ముగిసిన టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీ సమయంలో చోటుచేసుకున్న పరిణామాలను సంజూ గుర్తుచేసుకున్నాడు. ఆ టోర్నమెంట్‌లో ఇషాన్ కిషన్ అనూహ్యంగా జట్టులోకి పునరాగమనం చేయగా, వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు విశ్రాంతినిచ్చారు. టోర్నీ ఆరంభంలో ఫామ్ లేమితో ఇబ్బంది పడిన సంజూ శాంసన్‌ను మధ్యలో కొన్ని మ్యాచ్‌లకు పక్కనపెట్టారు. అతని స్థానంలో అభిషేక్ శర్మతో కలిసి ఇషాన్ కిషన్ ఓపెనింగ్ చేశాడు. ఈ పోటీపై ఒక పాడ్‌కాస్ట్‌లో సంజూ శాంసన్ మాట్లాడుతూ... "నిజం చెప్పాలంటే, ఇషాన్ కిషన్ ఎక్కడి నుంచో జట్టులోకి దూసుకొచ్చాడు. ముస్తాక్ అలీ ట్రోఫీలో అద్భుతంగా ఆడాడు. తన జట్టు ఝార్ఖండ్‌కు ఛాంపియన్‌షిప్ అందించాడు. అతని కథ కూడా గొప్పది. గత రెండేళ్లుగా జట్టుకు దూరమైన అతను, దేశవాళీ క్రికెట్‌లో తీవ్రంగా శ్రమించి తిరిగి తన మార్గాన్ని సుగమం చేసుకున్నాడు. అతను పరుగులు చేయడం ప్రారంభించినప్పుడే, నా స్థానం కోసం వస్తున్నాడని నాకు అనిపించింది. ఈ విషయాన్ని నేను కెమెరా ముందు ఒప్పుకుంటున్నాను" అని తెలిపాడు. ముఖ్యంగా ప్రపంచకప్‌కు ముందు తిరువనంతపురంలో ఇషాన్ సెంచరీ సాధించినప్పుడు తన ఆలోచనలు ఎలా ఉన్నాయో సంజూ వివరించాడు. "ఆ సెంచరీ తర్వాత, 'సంజూ, ఇప్పుడు ఈ స్థానాన్ని అతనికి వదిలేయ్ బాస్. నీకంటే అతడే ఎక్కువ అర్హుడు' అని నాకు నేనే చెప్పుకున్నాను. నీకు అవకాశాలు వచ్చినా పరుగులు చేయలేదు, కానీ అద్భుతమైన ఫామ్‌లో ఉన్న ఒక ఆటగాడు సిద్ధంగా ఉన్నాడు అనిపించింది. అతను ప్రతిదీ సరిగ్గానే చేసి జట్టులోకి వచ్చాడు" అని సంజూ పేర్కొన్నాడు. అయితే, ఈ ఆరోగ్యకరమైన పోటీ భారత జట్టుకు మేలు చేసింది. న్యూజిలాండ్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ ముగ్గురూ అర్ధ సెంచరీలతో చెలరేగి, భారత్‌కు మూడోసారి టీ20 ప్రపంచకప్ అందించడంలో కీలక పాత్ర పోషించారు.

## టీమిండియా పునరాగమనం పై భువనేశ్వర్ కుమార్ ఏమన్నాడంటే..!

( హంసకలం వార్త ) మే 12



సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ జాతీయ జట్టులోకి తన పునరాగమనంపై వస్తున్న చర్చలకు తెరదించాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) తరఫున అద్భుతంగా రాణిస్తున్నప్పటికీ, తాను మళ్లీ భారత జట్టులోకి రావడం గురించి ఆలోచించడం లేదని స్పష్టం చేశాడు. గతంలో ఎదురైన నిరాశల కారణంగా దీర్ఘకాలిక లక్ష్యాలను నిర్దేశించుకోవడం మానేశానని అన్నాడు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 21 వికెట్లు పడగొట్టి ఆర్‌సీబీ విజయావకాశాల్లో కీలక పాత్ర పోషిస్తున్న 36 ఏళ్ల భువనేశ్వర్‌ను తిరిగి జాతీయ జట్టులోకి తీసుకోవాలని పలువురు మాజీ క్రికెటర్లు, క్రీడా నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆర్‌సీబీ విడుదల చేసిన ఓ వీడియోలో భువీ మాట్లాడుతూ.. "నేను టీమిండియా కమ్‌బ్యాక్ గురించి ఆలోచించడం లేదు. దీర్ఘకాలిక లక్ష్యాలు పెట్టుకోవడం ఎప్పుడో మానేశాను. ఎందుకంటే అలా చేసినప్పుడల్లా అది నాకు కలిసి రాలేదు" అని తెలిపాడు. తన సుదీర్ఘ కెరీర్‌ను గుర్తుచేసుకుంటూ.. "నాకు సహజంగానే బంతిని స్వింగ్ చేసే నైపుణ్యం ఉంది. అది దేవుడిచ్చిన వరం. నేను ఎప్పుడూ ఎక్స్‌ప్రెస్ బౌలర్‌ను కాదు. వేగంగా బౌలింగ్ చేయకపోవడం వల్ల త్వరగా అలసిపోను. బహుశా అదే నా కెరీర్‌కు మేలు చేసి ఉండవచ్చు" అని వివరించాడు.

# స్పోర్ట్స్

## ఢిల్లీ గెలిచినా.. కెప్టెన్ అక్షర్ పటేల్‌కు మాత్రం షాక్!

- స్లో ఓవర్ రేట్ కారణంగా ఢిల్లీ కెప్టెన్ అక్షర్ పటేల్‌కు జరిమానా
- ఐపీఎల్ నిబంధనల ప్రకారం రూ. 12 లక్షల ఫైన్
- ఈ సీజన్‌లో ఢిల్లీ జట్టుకు ఇది తొలి తప్పిదం
- ఉత్కంఠ భరిత మ్యాచ్‌లో పంజాబ్ పై ఢిల్లీ క్యాపిటల్స్ విజయం



( హంసకలం వార్త ) మే 12

ధర్మశాల వేదికగా పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ) విజయం సాధించినప్పటికీ, ఆ జట్టు కెప్టెన్ అక్షర్ పటేల్‌కు జరిమానా తప్పలేదు. ఈ మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ నమోదు చేసిన కారణంగా అక్షర్‌కు రూ. 12 లక్షల ఫైన్ విధిస్తున్నట్లు ఐపీఎల్ యాజమాన్యం ప్రకటించింది. ఐపీఎల్ 2026 సీజన్‌లో ఢిల్లీ జట్టుకు స్లో ఓవర్ రేట్ కారణంగా ఇది తొలి తప్పిదం. దీంతో ఐపీఎల్ ప్రవర్తనా నియమావళి ప్రకారం కెప్టెన్ అక్షర్ పటేల్‌కు రూ. 12 లక్షల జరిమానా విధించినట్లు ఐపీఎల్ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్, ప్రియాన్ష్ ఆర్య, శ్రేయస్ అయ్యర్, సూర్యాన్ష్ షెడ్గే మెరుపులతో నిర్ణీత ఓవర్లలో 5 వికెట్లకు 210 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం 211 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ, 33 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అయితే, కెప్టెన్ అక్షర్ పటేల్ (30 బంతుల్లో 56), డేవిడ్ మిల్లర్ (51) అద్భుత భాగస్వామ్యంతో జట్టును ఆదుకున్నారు. చివర్లో మాధవ్ తివారీ (8 బంతుల్లో 18), అశుతోష్ శర్మ (10 బంతుల్లో 24) మెరుపు ఇన్నింగ్స్‌లతో 19వ ఓవర్లోనే ఢిల్లీ 216/7 స్కోరు చేసి విజయాన్ని అందుకుంది. ఈ విజయంతో ఢిల్లీ క్యాపిటల్స్ తమ ప్లేఆఫ్ ఆశలను సజీవంగా ఉంచుకోగా, ఓటమి పాలైనప్పటికీ పంజాబ్ 13 పాయింట్లతో పట్టికలో నాలుగో స్థానంలో కొనసాగుతోంది.

## సీఎం విజయ్ మీకు హ్యాట్సాఫ్..
## అద్భుతమైన నిర్ణయం: నటుడు విశాల్



తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నటుడు విజయ్, అధికారంలోకి వచ్చిన వెంటనే సంచలన నిర్ణయం తీసుకున్నారు. సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన రెండు రోజులకే, రాష్ట్రవ్యాప్తంగా 717 మద్యం దుకాణాలను మూసివేస్తూ తన తొలి సంతకం చేశారు. దేవాలయాలు, పాఠశాలలు, బస్టాండ్‌లకు 500 మీటర్ల పరిధిలో ఉన్న ఈ మద్యం దుకాణాలను తక్షణమే తొలగించాలని ఆయన తన తొలి ఉత్తర్వులో పేర్కొన్నారు. విజయ్ నిర్ణయం పై ఆయన స్నేహితుడు, నటుడు విశాల్ ఎక్స్ వేదికగా ప్రశంసలు కురిపించారు. “డియర్ సీఎం జోసెఫ్ విజయ్ గారు.. మీకు మా అభినందనలు. 717 వైన్ షాపులను, మరీ ముఖ్యంగా స్కూళ్ల దగ్గర ఉన్నవాటిని మూసివేస్తున్నట్లు ప్రకటించినందుకు ధన్యవాదాలు. ఆర్కే నగర్‌లో నాకు తెలిసిన ఒక విద్యార్థిని రోజూ మద్యం దుకాణం దాటుకుని ఇంటికి వెళ్లేందుకు చాలా భయపడేది. ఇప్పుడు ఆ అమ్మాయితో పాటు ఎంతోమంది సామాన్యులు మీ నిర్ణయాన్ని మెచ్చుకుంటారు. ఈ నిర్ణయంతో ఎన్నో ముఖాల్లో చిరునవ్వు చూస్తున్నాం. ఈ ఆనందం ఎప్పటికీ నిలిచిపోతుంది. దేవుడు మిమ్మల్ని చల్లగా చూడాలి” అని విశాల్ ఆ పేర్కొన్నారు.

# రూ. 30 వేల కోట్ల కపూర్ కుటుంబ ఆస్తి వివాదం..
# 'మహాభారతాన్ని మించిపోయింది' అన్న సుప్రీంకోర్టు

- రూ. 30,000 కోట్ల సంజయ్ కపూర్ కుటుంబ ఆస్తి వివాదం
- సుప్రీంకోర్టుకు చేరిన వ్యవహారం
- మహాభారతంతో పోల్చిన ధర్మాసనం
- మాజీ సీజేఐ చంద్రచూడ్ మధ్యవర్తిత్వానికి అంగీకారం
- వివాదంలో బహుముఖ కోణాలు.. పలు కేసులు



ప్రముఖ వ్యాపారవేత్త సంజయ్ కపూర్ మరణంతో మొదలైన రూ. 30,000 కోట్ల వారసత్వ వివాదం మరింత ముదురుతోంది. కుటుంబ సభ్యుల మధ్య ఆధిపత్య పోరు నడుస్తుండగా, ఈ వ్యవహారం ఇప్పుడు సుప్రీంకోర్టుకు చేరింది. ఇందులో నటి కరిష్మా కపూర్ పేరు కూడా ముడిపడి ఉంది. ఈ వివాదంపై విచారణ సందర్భంగా జస్టిస్ జేబీ పార్థీవాలా నేతృత్వంలోని ధర్మాసనం ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. “మేము ఒక ఘట్టంలోకి ప్రవేశించాం. దీని ముందు మహాభారతం కూడా చాలా చిన్నదిగా కనిపిస్తుంది” అని వ్యాఖ్యానించి, ఈ వివాద తీవ్రతను తెలియజేసింది. గతేడాది జూన్‌లో ఇంగ్లండ్‌లో పోలో ఆడుతూ వ్యాపారవేత్త సంజయ్ కపూర్ మరణించారు. కాగా, ఆయన తల్లి రాణి కపూర్ (80) నేడు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కుటుంబ ఆస్తులలో కీలకమైన రఘువంశీ ఇన్వెస్ట్‌మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఆర్ఐపీఎల్) బోర్డు ఈ నెల 18న సమావేశం కాకుండా నిరోధించాలని ఆమె తన పిటిషన్‌లో కోరారు. కోర్టు ఆదేశించిన మధ్యవర్తిత్వ ప్రక్రియను పక్కనపెట్టేందుకు ఇది ఒక మోసపూరిత ప్రయత్నమని ఆమె ఆరోపించారు. ఈ పిటిషన్‌పై ఈ నెల 14న విచారణ జరుపుతామని ధర్మాసనం తెలిపింది. ఈ వివాదాన్ని పరిష్కరించేందుకు గత వారం సుప్రీంకోర్టు భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి డి.వై. చంద్రచూడ్‌ను మధ్యవర్తిగా నియమించిన విషయం తెలిసిందే. ఆర్‌కే ట్రస్ట్, సోనా కామ్‌స్టార్‌తో పాటు కపూర్ కుటుంబానికి చెందిన కంపెనీలకు సంబంధించిన వివాదాలను ఆయన పరిష్కరించనున్నారు. అసలు ఈ ఆర్‌కే ట్రస్ట్ చట్టవిరుద్ధమని, ఫోర్జరీ, మోసంతో దానిని సృష్టించారని రాణి కపూర్ గతంలోనే హైకోర్టులో సివిల్ దావా వేశారు. అయితే, ఈ మధ్యవర్తిత్వ ప్రక్రియలో సంజయ్ కపూర్ రాసిన వీలునామాకు సంబంధించిన వివాదం లేదు. ఆ వీలునామాపై సంజయ్ కపూర్ మూడో భార్య ప్రియా కపూర్‌కు, ఆయన రెండో భార్య, నటి కరిష్మా కపూర్‌కు పుట్టిన పిల్లలు కియాన్, సమీరా కపూర్‌లకు మధ్య వేరే న్యాయపోరాటం జరుగుతోంది. సంజయ్ కపూర్ వీలునామాను ప్రియా కపూర్ ఫోర్జరీ చేశారని పిల్లలు ఆరోపిస్తున్నారు. ఇది కాకుండా ప్రియా కపూర్‌కు, సంజయ్ కపూర్ సోదరి మందిరా కపూర్ స్మిత్‌కు మధ్య పరువునష్టం కేసు కూడా నడుస్తోంది. ఈ కుటుంబ వివాదాలు బహుముఖ కోణాల్లో కొనసాగుతుండటంతో న్యాయస్థానాలు సైతం విసిగిపోతున్నాయి. ఫిబ్రవరిలో ఢిల్లీ హైకోర్టు ఇరు పక్షాలను గౌరవంగా ప్రవర్తించాలని మందలించాల్సి వచ్చింది.


# బ్లాక్ బస్టర్ హిట్ 'ధురంధర్-2' ఓటీటీలోకి వచ్చేస్తోంది

- మే 15న జియోహాట్‌స్టార్‌లో 'ధురంధర్ 2' విడుదల
- నెట్‌ఫ్లిక్స్‌లో సైఫ్ అలీ ఖాన్ 'కర్తవ్య' స్ట్రీమింగ్
- వివిధ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో 15కు పైగా కొత్త చిత్రాలు, సిరీస్‌లు
- నెట్‌ఫ్లిక్స్‌లో 'ఇన్‌స్పెక్టర్ అవినాష్' రెండో సీజన్
- యాక్షన్, థ్రిల్లర్, కామెడీ జానర్లలో అలరించనున్న సినిమాలు




సినిమా ప్రియులకు, ముఖ్యంగా ఇంట్లోనే కూర్చుని సినిమాలు చూసే ఓటీటీ ఆడియన్స్‌కు ఈ వారం పండగలాంటిది. నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్ వీడియో, జియోహాట్‌స్టార్ వంటి ప్రముఖ ప్లాట్‌ఫామ్‌లలో ఏకంగా 15కు పైగా కొత్త సినిమాలు, వెబ్ సిరీస్‌లు సందడి చేయనున్నాయి. వీటన్నింటిలో ప్రధాన ఆకర్షణగా రణవీర్ సింగ్ నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్: ది రివెంజ్' (ధురంధర్ 2) నిలుస్తోంది. 2025లో వచ్చిన సినిమాకు సీక్వెల్‌గా వస్తున్న ఈ చిత్రంలో రణవీర్ సింగ్ మరోసారి జస్కిరత్ సింగ్ రంగి పాత్రలో కనిపించనున్నారు. పాకిస్థాన్‌లోని కరాచీలో హమ్జా అలీ మజారీగా అతను ఎలా ఎదిగాడనే కథాంశంతో ఈ సినిమా సాగుతుంది. భారీ తారాగణంతో తెరకెక్కిన ఈ చిత్రంలో అర్జున్ రాంపాల్, సంజయ్ దత్, ఆర్. మాధవన్ కీలక పాత్రలు పోషించారు. 'ధురంధర్ 2' మే 15 నుంచి జియోహాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఇక నెట్‌ఫ్లిక్స్‌లో సైఫ్ అలీ ఖాన్ ప్రధాన పాత్రలో నటించిన 'కర్తవ్య' మే 15న విడుదల కానుంది. ఓ జర్నలిస్ట్ హత్య తర్వాత కుటుంబం, విధి నిర్వహణ మధ్య నలిగిపోయే ఎస్‌హెచ్‌ఓ పాత్రలో సైఫ్ నటన ఆకట్టుకోనుంది. అలాగే, యూపీ సూపర్ కాప్ అవినాష్ మిశ్రా నిజ జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన 'ఇన్‌స్పెక్టర్ అవినాష్' రెండో సీజన్ కూడా అదే రోజు నెట్‌ఫ్లిక్స్‌లో రానుంది. ఇందులో రణదీప్ హుడా మరోసారి పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నారు. ఇవే కాకుండా, రైన్ గోస్లింగ్ నటించిన సైన్స్ ఫిక్షన్ చిత్రం 'ప్రాజెక్ట్ హైల్ మేరీ' అమెజాన్ ప్రైమ్‌లో, ప్రముఖ కమెడియన్ జీవితంపై తీసిన డాక్యుమెంటరీ 'మార్టీ: లైఫ్ ఈజ్ షార్ట్' నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులోకి వచ్చాయి. వీటితో పాటు 'కాళిదాస్ 2', 'తిమ్మరాజుపల్లి టీవీ', 'డెవిల్ మే క్రై: సీజన్ 2' వంటి మరికొన్ని చిత్రాలు, సిరీస్‌లు కూడా ఈ వారం ప్రేక్షకులను అలరించనున్నాయి. మొత్తం మీద ఈ వారం యాక్షన్, థ్రిల్లర్, కామెడీ, సై-ఫై వంటి విభిన్న జానర్లతో ఓటీటీ ప్రియులకు ఫుల్ మీల్స్ ఖాయం.

# మహాకాళేశ్వరుడి సన్నిధిలో తమన్నా..
# భస్మ హారతిలో పాల్గొన్న నటి



ప్రముఖ నటి తమన్నా ఈ తెల్లవారుజామున మధ్యప్రదేశ్‌లోని ప్రసిద్ధ ఉజ్జయిని మహాకాళేశ్వర ఆలయాన్ని సందర్శించారు. బ్రహ్మ ముహూర్తంలో జరిగే అత్యంత పవిత్రమైన 'భస్మ హారతి' సేవలో ఆమె పాల్గొన్నారు. సాంప్రదాయ దుస్తులు ధరించి, తన స్నేహితురాలు, నిర్మాత ప్రజ్ఞా కపూర్‌తో కలిసి ఆమె స్వామివారిని దర్శించుకున్నారు. వేద మంత్రోచ్చారణలు, గంటల నాదాల మధ్య జరిగిన ఈ క్రతువులో తమన్నా అత్యంత భక్తిశ్రద్ధలతో లీనమై ప్రార్థనలు చేస్తున్న వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దర్శనం అనంతరం తమన్నా మీడియాతో మాట్లాడుతూ, “దైవ పిలుపు ఉన్నప్పుడే ఎవరైనా ఈ క్షేత్రాన్ని దర్శించుకోగలరు. ఈ రోజు భస్మ హారతిని వీక్షించే అవకాశం కలగడం నా అదృష్టం. అక్కడ కూర్చుని ఆ ఆధ్యాత్మిక ప్రకంపనలను అనుభూతి చెందడం ఒక గొప్ప శక్తిని ఇచ్చింది” అని తన సంతోషాన్ని పంచుకున్నారు. ఆలయ గర్భాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆమె, తన రాబోయే ప్రాజెక్టులు విజయవంతం కావాలని మొక్కుకున్నారు. సినిమాల విషయానికి వస్తే, తమన్నా త్వరలో సిద్ధార్థ్ మల్హోత్రాతో కలిసి 'వ్యాన్' అనే ఫోక్‌లోర్ థ్రిల్లర్‌లో నటించబోతున్నారు. ఏక్తా కపూర్, టీవీఎఫ్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం 2026 ఆగస్టు 28న రక్షా బంధన్ కానుకగా విడుదల కానుంది. మధ్య భారతదేశంలోని దట్టమైన అడవుల నేపథ్యంలో, పురాతన ఇతిహాసాలు, దేవాలయాల చుట్టూ ఈ కథ సాగనుంది. దీపక్ మిశ్రా, అరుణభ్ కుమార్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు.

# 'పెద్ది' ట్రైలర్, కొత్త సాంగ్ రిలీజ్ నార్త్‌లో




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వస్తున్న పాన్ ఇండియా చిత్రం 'పెద్ది'. ఈ సినిమా ప్రమోషన్ల విషయంలో చిత్రబృందం పక్కా వ్యూహంతో ముందుకు వెళుతోంది. ముఖ్యంగా ఉత్తరాది, హిందీ మార్కెట్‌ను లక్ష్యంగా చేసుకుని ప్రచార కార్యక్రమాలను ప్లాన్ చేస్తోంది. ఇందులో భాగంగానే సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను ముంబైలో, ఓ కీలకమైన పాటను భోపాల్‌లో విడుదల చేసేందుకు సిద్ధమవుతోంది. ఈ సినిమా ట్రైలర్‌ను మే 18న ముంబైలో జరగనున్న ఓ కార్యక్రమంలో విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. దీనికి కొనసాగింపుగా, హిందీ ప్రేక్షకులను మరింతగా ఆకట్టుకునేందుకు భోపాల్‌లో భారీ మ్యూజికల్ ఈవెంట్‌ను నిర్వహించనున్నారు. ఈ విషయంపై దర్శకుడు బుచ్చిబాబు సానా ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. “భోపాల్‌లో చాలా పెద్ద స్థాయిలో ఒక ఈవెంట్ చేయాలనుకున్నాం. సినిమాలోని ఓ స్పెషల్ సాంగ్‌ను గ్రాండ్ మ్యూజికల్ ఈవెంట్‌తో లాంచ్ చేయాలని నిర్ణయించాం. అందుకే చిత్రబృందం మొత్తం భోపాల్‌లోనే తర్వాతి పాటను విడుదల చేయనుంది” అని తెలిపారు. “భారతదేశం నడిబొడ్డున ఉన్న భోపాల్ నుంచి ప్రమోషన్లు ప్రారంభిస్తే, ప్రతి భారతీయుడి హృదయాన్ని చేరుకోగలమని మేం బలంగా నమ్ముతున్నాం. ఇప్పటికే అక్కడ సన్నాహాలు కూడా పూర్తి చేశాం” అని బుచ్చిబాబు వివరించారు. ఈ సినిమాలో బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించడం, ఏఆర్ రెహమాన్ సంగీతం అందించడం హిందీ మార్కెట్‌లో సినిమాకు మరింత బలాన్ని చేకూర్చే అంశాలు. ఈ ప్రమోషన్ల వ్యూహం చూస్తుంటే, ఉత్తరాది బాక్సాఫీస్‌పై 'పెద్ది' టీమ్ గట్టిగానే కన్నేసినట్లు స్పష్టమవుతోంది.

Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449